
# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 212 | హైదరాబాద్ | శుక్రవారం 13-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

చంద్రుడిపై గల్లంతైన నాటి స్పేస్ క్రాఫ్ట్ మిస్టరీని తేల్చేసిన కృత్రిమ మేధ!


11లో

## ట్రిపుల్ ఐటీల్లో..
## పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తాం

- రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీల్లో శాశ్వత సౌకర్యాలు కల్పిస్తామన్న మంత్రి లోకేశ్
- కేంద్ర ప్రభుత్వ 'సాస్కీ' పథకం ద్వారా నిధుల సమీకరణకు ప్రయత్నాలు
- నాలుగు క్యాంపస్‌ల శాశ్వత భవనాలకు అవసరమైన నిధుల వివరాలు వెల్లడి
- పుట్టపర్తిలో కొత్త ట్రిపుల్ ఐటీ ఏర్పాటుపై సీఎంతో చర్చిస్తామని హామీ
- విద్యార్థులు చేరిన క్యాంపస్‌లోనే చదువు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడి

## చిప్ తయారీ దిగ్గజం
## ఇంటెల్ పై సీసీఐ కొరడా

- ఇంటెల్‌పై రూ.27.38 కోట్లు జరిమానా విధించిన సీసీఐ
- వివక్షాపూరిత వారెంటీ పాలసీని అమలు చేసినందుకు ఈ చర్య
- భారత్‌లో కొన్న మైక్రోప్రాసెసర్లకే వారెంటీ వర్తించేలా విధానం
- ఈ పాలసీ వినియోగదారుల ఎంపికను పరిమితం చేసిందని గుర్తింపు

11లో




## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ.
## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ

- వివిధ విమానాశ్రయాల అభివృద్ధి పనులకు సంబంధించి చర్చ
- మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడి
- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన ముఖ్యమంత్రి


11లో

## అడవుల్లోని గిరిజన గ్రామాలకు 'సంజీవని' డ్రోన్లు..
## ఏపీలో సరికొత్త వైద్య సేవలు!



11లో

- సరైన రవాణా సదుపాయం లేని గ్రామాలకు ప్రాణదాతలుగా డ్రోన్లు
- 20 నిమిషాల్లోపే అత్యవసర మందుల సరఫరా
- రెడ్ వింగ్ సంస్థతో కలిసి ఏపీ ప్రభుత్వం సరికొత్త సేవలు

## రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి..
## సభలో ఎంపీ నోటీసు


11లో

- అమెరికాతో భారత్ ట్రేడ్ డీల్ పై రాహుల్ ఆరోపణలు
- నరవణె బుక్ పై మాట్లాడకుండా అడ్డుకుంటోందని ప్రభుత్వంపై విమర్శలు
- దేశాన్ని అమ్మేశారన్న రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీల ఆగ్రహం

## ఎర్రకోట దాడి వెనుక జైషే హస్తం..
## మహిళలతో ప్రత్యేక వింగ్
## ఐరాస సంచలన నివేదిక



11లో

## జర్నలిస్టులకు 44 వేలకు పైగా అక్రిడిటేషన్ కార్డులు


11లో



12లో

## అగ్నిపరీక్ష.. ఆక్రమణలపై
## హైడ్రా 'ఉక్కుపాదం'!

- నిబంధనల ఉల్లంఘనలే లక్ష్యంగా మార్చి నుంచి 'మెగా ఆపరేషన్'
- పాతబస్తీ వేదికగా రంగనాథ్ హెచ్చరిక: 'ముప్పై సెకన్లలోనే సర్వం భస్మం'
- అక్రమ నిర్మాణాలకు ఇక కాలం చెల్లినట్టే.. క్షేత్రస్థాయిలో 'హైడ్రా' డేగకన్ను

భారతశక్తి

# చర్చపై వెనుకడుగు ఎందుకు

వివాదాస్పద అంశాలు తలెత్తినప్పుడు కూలంకషంగా చర్చించడానికి పార్లమెంట్ సరైన వేదిక కావాలని రాజనీతిజ్ఞులు అభిప్రాయపడుతుంటారు. కానీ ప్రస్తుతం అలాంటి వాతావరణం పార్లమెంట్ సమావేశాల్లో కనిపించడం లేదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ప్రధాని మోడీ ప్రసంగం లేకుండానే ఫిబ్రవరి 5న ఆమోదం పొందడం పార్లమెంట్ చరిత్రలో అనూహ్య ఘట్టం. దాదాపు 22 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ప్రధాని మోడీ ప్రసంగించకుండానే సభ వాయిదా పడడానికి సంబంధించి ప్రధాని మోడీ కొద్ది క్షణాల్లో ప్రసంగిస్తారనగా, కాంగ్రెస్ ఎంపిలు కొందరు ప్రధాని కుర్చీని చుట్టుముట్టి "అనూహ్యమైన చర్యలు" లేదా భౌతికదాడి చేసే అవకాశం ఉందనే కచ్చితమైన సమాచారం తనకు ఉందని స్పీకర్ ఓం బిర్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. సభలో గందరగోళం మధ్య ప్రధాని గౌరవానికి, భద్రతకు భంగం కలిగించే అవకాశం ఉందని, సభా మర్యాదలు దెబ్బతినకుండా ఉండేందుకు స్పీకర్ బిర్లానే ప్రధాని మోడీని సభకు రావద్దని విజ్ఞప్తి చేశారు. అంతేకాక సభలో ప్రధానికి హాని తలపెట్టే సూచనలు పరోక్షంగా కనిపించడంతో తానే ప్రధానిని రావద్దని ముందుగా హెచ్చరించానని స్పీకర్ బిర్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశ భద్రతకు సంబంధించిన అంశాలు విపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ ప్రస్తావించడం సభలో గందరగోళం సృష్టించింది. స్పీకర్ బిర్లా రాహుల్ గాంధీని తరువాత మాట్లాడ్డానికి ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. మరునాడు సభలో ప్రధాని మోడీ ఉంటే తాము రాహుల్ గాంధీ ప్రస్తావించిన అంశాలపై ప్రశ్నలు అడిగి ఉండేవారమని, దీనికి భయపడే ప్రధాని మోడీ సభకు రాలేదని విపక్షాలు ఆరోపించాయి. ప్రధానిని సభకు రావద్దని కోరడం ద్వారా సభా గౌరవాన్ని, నాయకుడి భద్రతను స్పీకర్ కాపాడారని బిజెపి నేతలు సమర్థించుకున్నారు. లోక్‌సభ విపక్ష నాయకుడ్ని సభలో మాట్లాడనీయకపోవడం, మరోవైపు ప్రధాని మోడీ ప్రసంగించడానికి సభకు రానీయకపోవడం ఈ రెండూ పార్లమెంటరీ ప్రమాణాలకు వ్యతిరేకమైనవే. అంతేకాకుండా ప్రజాస్వామ్య జవాబుదారీతనానికి తిలోదకాలిచ్చినట్టే అవుతుంది. చర్చసమాధానం పార్లమెంట్ వ్యవస్థలో తప్పనిసరి. దీని ద్వారా కార్యనిర్వాహకవర్గం పార్లమెంట్‌కు జవాబుదారీ అవుతుంది. ప్రధాని కుర్చీ వద్ద అనూహ్యమైన సంఘటనలు జరుగుతాయని విశ్వసనీయమైన సమాచారం అందిందని అందుకే ప్రధానిని రావద్దని తాను విజ్ఞప్తి చేసినని చెప్పడం ఆక్షేపణీయమవుతోంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలపై ప్రధాని సమాధానంతోనే తీర్మానం కావలసి ఉందని పార్లమెంటరీ నిబంధనలు చెబుతున్నాయని, ఒకవేళ ప్రధాని ప్రసంగం లేకుండా చర్చలు ముగించాలని సభ నిర్ణయిస్తే ఆమేరకు ప్రత్యేక తీర్మానం సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందవలసి ఉంటుందని నిబంధనలను ఆయన గుర్తు చేశారు. నరవణె పుస్తకం ముద్రణ అయిందా లేదా అన్నది ఇక్కడ ముఖ్యం కాదు. ఆ పుస్తకంలోని వివాదాస్పద అంశాలపై స్పీకర్ ముందు ప్రామాణీకరించాలని రాహుల్ సిద్ధపడ్డారు. అలాంటప్పుడు తప్పనిసరిగా రాహుల్‌ను సభలో చర్చకు అవకాశం ఇవ్వాల్సి ఉంది. ఆ పుస్తకంలో దేశ భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశాలు ప్రస్తావించి ఉన్నాయి. దీనిపై సభ్యులను చర్చించడానికి ఒప్పుకోకపోవడం జవాబుదారీ నుండి బాధ్యతను తప్పించుకోవడమే అవుతుంది. పార్లమెంట్ బయట రాహుల్ నరవణె పుస్తకం లోని వివాదాస్పద అంశాలను బయటపెట్టారు. అవి వాస్తవాలైతే కీలకమైన చర్చలకు అవకాశం ఇవ్వకుండా జవాబుదారీ కాకుండా రాజకీయ పెత్తనం ద్వారా తప్పించుకుందని స్పష్టమవుతుంది. దీనిపై సమగ్రంగా చర్చలు చేపట్టిన తరువాత ప్రధాని సమాధానంతో ముగింపు పలికితే రాహుల్ కానీ, విపక్షాలు కానీ నరవణె పుస్తకం లోని అంశాలుపై లేవదీసిన వాదనలు తప్పని నిరూపించడానికి ఒక సువర్ణావకాశం అయ్యేది. దీనికి భిన్నంగా మోడీ సమాధానం దాటవేయడం ద్వారా తన విమర్శకుల ఆరోపణలు నిజమేనన్న అపోహలు నిరూపించుకున్నట్టు అభిప్రాయం కలుగుతుంది. కీలకమైన ఇలాంటి అంశాలపై చర్చలు లేకుండా తప్పించుకోవడం పాలక వర్గాల్లో ప్రజాదరణ తగ్గుతుందనే భయం ఒక కారణం కాగా, పార్లమెంట్‌కు జవాబుదారీతనం లేని ధోరణిని సూచిస్తుంది. దీనివల్ల ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు ఈ నమ్మకం సన్నగిల్లే పరిస్థితి ఏర్పడుతుంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలతో ఉభయ సభల కార్యకలాపాలకు తరచుగా అంతరాయం కలుగుతుండడం పరిపాటిగా వస్తోంది. సభలో తమను మాట్లాడనీయడం లేదని లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు విపక్షాలు నోటీసులు ఇచ్చినట్టు త్వరలో ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తోంది. రాహుల్ గాంధీని స్పీకర్ ప్రసంగించడానికి అనుమతించలేదని, కాంగ్రెస్ ఎంపిలు, మహిళా నేతలను కించపరిచేలా విమర్శించిన బిజెపి ఎంపి నిషికాంత్ దూబేపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అందుకే ఈ అవిశ్వాస తీర్మానం తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. ఈ తీర్మానం తీసుకు రావాలంటే కనీసం వందమంది ఎంపిల సంతకాలు అవసరం. విపక్షాలు ఆ సంతకాల సేకరణలో నిమగ్నమైనట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో కాంగ్రెస్ సమావేశం కూడా అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకుందని ఆయా వర్గాలు చెబుతున్నాయి.

====================చీచీచీ

# మోడీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న స్టేషన్లు

విజయవాడ, ఫిబ్రవరి 12, (భారతశక్తి):

ఏపీలో అమృత్ భారత్ స్కీమ్‌లో 73 రైల్వే స్టేషన్‌లను 3418 కోట్ల రూపాయలతో పూర్తిగా అధునీకరిస్తున్నారు వాటిలో విజయవాడ పరిధిలో 21 స్టేషన్‌లు ఉన్నాయి. కొన్ని ముఖ్యమైన రైల్వే స్టేషన్‌ల పనులు పూర్తి అయ్యాయి. త్వరలోనే దేశవ్యాప్తంగా రెడీ అయిన రైల్వే స్టేషన్‌లను ప్రధాని మోదీ ఒకేసారి ప్రారంభించనున్నారు. వాటిలో విజయవాడ డివిజన్ పరిధిలో 4 స్టేషన్‌లు ఉన్నాయి. అవే రాయనపాడు, నిడదవోలు,కాకినాడ టౌన్,తుని.

1) రాయనపాడు రైల్వే స్టేషన్

విజయవాడ స్టేషన్‌కు సాటిలైట్ స్టాప్‌గా ఏర్పడిన రాయనపాడు ఇప్పుడు పూర్తిగా రూపం మార్చుకుంది. కొన్ని విషయాల్లో విజయవాడ స్టేషన్ కంటే అందంగా ముస్తాబైంది. విజయవాడ స్టేషన్‌పై భారం తగ్గించేందుకు ఏర్పడిన రాయనపాడు పెరుగుతున్న విజయవాడ పరిధికి మరో స్టేషన్‌గా మారింది. ఇప్పటికే చాలా రైళ్లు విజయవాడ మెయిన్ స్టేషన్‌కు వెళ్లనవసరం లేకుండా గుణదల నుంచి రాయనపాడు లైన్‌లో ఖమ్మం రూట్‌లోకి వెళ్లిపోతున్నాయి. ఇలాంటి ట్రైన్స్‌కి రాయన పాడులో హాల్ట్ ఇస్తున్నారు. సికింద్రాబాద్‌కు చర్లపల్లి ఎలానో విజయవాడకు రాయనపాడు అలాంటిదే. ప్రస్తుతం ఈ స్టేషన్ చూడడానికి చాలా అద్భుతంగా ఉంది.

2) నిడదవోలు రైల్వే స్టేషన్

గోదావరి జిల్లాల్లో అతి ముఖ్యమైన రైల్వే జంక్షన్ ఇది. చెన్నై-హౌరా మెయిన్ లైన్‌లో ఈ స్టేషన్ ఉంటుంది. ఇక్కడి నుంచి తణుకు, భీమవరం, నరసాపురం, గుడివాడ, మచిలీపట్నం మీదుగా విజయవాడ వెళ్లే మరో రూట్ ఉండడం వల్ల ఈ స్టేషన్‌ను డెవలప్ చెయ్యడానికి రైల్వే డిసైడ్ అయి ఏకంగా 30 కోట్లు కేటాయించింది. ఇంతకు ముందు కేవలం 3 ప్లాట్ ఫామ్స్ ఉంటే ఇప్పుడు వాటి సంఖ్య 5కు చేరుకుంది. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న పట్టణం కావడంతో నిడదవోలు చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా, సాంస్కృతికపరంగా, టూరిజంపరంగా చాలా ముఖ్యమైన ఏరియా. రానున్న గోదావరి పుష్కరాలను కూడా దృష్టిలో పెట్టుకుని రాజమండ్రికి దగ్గరలో గల ఈ స్టేషన్‌ను డెవలప్ చేశారు. ముఖ్యంగా ఈ స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన లిఫ్ట్, ఎస్కలేటర్ ప్రయాణికులకు చాలా సౌకర్యంగా మారాయి.

3) కాకినాడ టౌన్ స్టేషన్

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ ప్రస్తుత రూపం చూస్తే ఎవరైనా అవాక్కవ్వాల్సిందే. దీని రూపం ఎంతెలా మారింది అంటే రైల్వే కూడా ఈ స్టేషన్ డెవలప్మెంటను ప్రమోట్ చేసుకొంటోంది. కాకినాడలోని పారిశ్రామిక ప్రాంతాలను దేశంలోని ఇతర పట్టణాలతో కలిపే కాకినాడ టౌన్ స్టేషన్ విజయవాడ డివిజన్‌లో చాలా ముఖ్యమైంది. కాకినాడలో రెండు రైల్వే స్టేషన్‌లు ఉన్నాయి. కాకినాడ పోర్ట్, కాకినాడ టౌన్. వీటిలో కాకినాడ టౌన్ స్టేషన్ నుంచే ప్రయాణికులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఒకప్పుడు ఇక్కడ నుంచి రైళ్లు చాలా తక్కువగా వెళుతుండేవి. కానీ ఇప్పుడు వాటి సంఖ్య బాగా పెరిగింది. దానితో 21 కోట్ల ఖర్చుతో స్టేషన్‌ను బాగా డెవలప్ చేశారు. అందమైన మొక్కలు, కొత్త బెంచీలు, కుర్చీలు, అధునాతన టాయిలెట్స్, స్టేషన్ గోడలపై స్వాతంత్ర్య సమరయోధుల పెయింటింగ్స్ ఇలా చాలా సౌకర్యాలు వచ్చేశాయి.

4) తుని రైల్వే స్టేషన్



చారిత్రక పట్టణం తుని స్టేషన్‌ను 19.కోట్లతో డెవలప్ చేసింది రైల్వే శాఖ. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జ్ఞాపకాలతో ముడిపడిన తుని సమీపంలోని గిరిజన గ్రామాలకు చాలా ముఖ్యమైన రైల్వే స్టేషన్. అటు వైజాగ్ వెళ్లాలన్నా ఇటు కాకినాడ, విజయవాడ లాంటి టౌన్ వెళ్లాలన్నా ఈ స్టేషన్ ద్వారానే ప్రయాణం చేస్తారు. చాలా కాలం నుంచి అభివృద్ధికి నోచుకోని తుని స్టేషన్ ఇప్పుడు అదిరిపోయే లుక్‌లోకి మారిపోయింది. ముఖ్యంగా స్టేషన్ ఎంట్రీ ముఖద్వారాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. అలానే స్టేషన్ లోపలి సౌకర్యాలను చక్కగా తీర్చిదిద్దారు.

# ఇక అమరావతి ఐటీ రాజధాని

విజయవాడ, ఫిబ్రవరి 12, (భారతశక్తి):

హైదరాబాద్‌ను హైటెక్ సిటీ పేరుతో ఐటీ హబ్‌గా మార్చినట్టుగానే, ఇప్పుడు అమరావతిని ప్రపంచ దేశాలు అబ్బురపడేలా క్వాంటం కంప్యూటింగ్ హబ్‌గా మార్చేందుకు ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తోంది. ఇది రాష్ట్ర చరిత్రలోనే మైలురాయిగా భావిస్తున్నారు. ఇది కేవలం టెక్ పార్క్ మాత్రమే కాదని రాబోయే తరాల భవిష్యత్‌ను మార్చే విజన్‌గా ప్రభుత్వం అభివర్ణిస్తోంది. మనం వాడుతున్న కంప్యూటర్లు, ఫోన్లు, బిట్స్




ఆధారంగా పని చేస్తాయి. అంటే చిన్నప్పుడు మీరు నేర్చుకున్న ద్విసంఖ్యామానం గుర్తుందా... అంటే ఎంత పెద్ద సంఖ్యలనైనా 0,1 రూపంలో రాయడం. వీటి ఆధారంగానే ఇప్పటి వరకు కంప్యూటర్, ల్యాప్‌టాప్, ఫోన్ పని చేస్తూ వచ్చాయి. ఇప్పుడు క్వాంటం కంప్యూటర్‌లో అలా కాదు. ఇక్కడ క్యూబిట్స్ ఆధారంగా పని చేస్తాయి. వీటి ప్రత్యేకత ఏంటంటే ఇవి ఒకే సమయంలో 0, 1 రెండూ అవ్వగలవు. దీన్నే సూపర్‌పొజిషన్ అంటారు. దీని వల్ల మామూలు కంప్యూటర్లు కొన్ని ఏళ్లు పని చేసే పనిని, క్వాంటం కంప్యూటర్లు కేవలం సెకన్లలో పూర్తి చేస్తాయి. ముఖ్యంగా మందుల తయారీ, వాతావరణ అంచనాలు, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. క్వాంటం కంప్యూటర్ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలో చేతులు కలిపింది. అమరావతిలో సుమారు యాభై ఎకరాల్లో ఈ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ఐబీఎం క్వాంటం సిస్టమ్ 2 అనే భారీ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 156 క్యూబిక్ హెరా ప్రాసెసర్‌ను వాడుతున్నారు. ఇది మన దేశంలోని అతి పెద్ద క్వాంటం కంప్యూటర్ కానుంది. ఈ వ్యాలీ కేవలం కంప్యూటర్లకే పరిమితం కాదు, ఇక్కడ హార్డ్‌వేర్ తయారీ, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, స్కిల్ ట్రైనింగ్ వంటివన్నీ ఒకే చోట ఉంటాయి. 2029 నాటికి దాదాపు ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

నిరుద్యోగులకు విద్యార్థులకు కలిగే ప్రయోజనం ఏంటీ?

ఈ ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెబుతున్నారు. దాదాపు లక్ష హై స్కిల్ ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం కేవలం ఉద్యోగాలు ఇవ్వడమే కాదు, యువతకు శిక్షణ కూడా ఇవ్వబోతోంది. వన్ ఎంటర్‌ప్రెన్యూర్ పర్ ఫ్యామిలీ అనే విజన్‌తో సుమారు పది లక్షల మంది యువతకు క్వాంటం స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వాలని ప్లాన్ చేశారు. ఇప్పటికే ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో యాభై వేల మంది విద్యార్థులకు ట్రైనింగ్ ఇస్తున్నారు. దీని వల్ల మన రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే భారీ జీతాలతో ఉద్యోగాలు సంపాదించుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఢిల్లీ వంటి సంస్థల భాగస్వామ్యంతో ఈ శిక్షణ కొనసాగుతోందని వెల్లడిస్తున్నారు.

ప్రజల జీవితాల్లో వచ్చే మార్పులేంటి?

2030 నాటికి దాదాపు ఐదు వేల కోట్ల విలువైన ఎగుమతులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతి ఇండియాకే క్వాంటం క్యాపిటల్‌గా మారుతుందని చెబుతున్నారు. క్వాంటం కంప్యూటర్ల సహాయంతో క్యాన్సర్ వంటి వ్యాధులకు త్వరగా మందులు కనుగొనే అవకాశం ఉంది. వాతావరణాన్ని ముందే కచ్చితంగా అంచనా వేయడం ద్వారా రైతులకు పంటల విషయంలో ఎంతో లాభం కలుగుతుందని వివరిస్తున్నారు. ఆనలైన్ మోసాలు అరికట్టేందుకు కూడా సురక్షితమైన వ్యవస్థ తయారవుతుందని తెలుపుతున్నారు. దీనిపై మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ నాడు హైదరాబాద్‌ను ఐటీ రంగంలో ఎలాగైతే ముందు నిలిపారో, నేడు అమరావతిని డీప్‌టెక్ రంగంలో గ్లోబల్‌లీడర్‌గా చేయాలని చంద్రబాబు కంకణం కట్టుకున్నారని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎవర్నీ ఫాలో అవ్వని అందరికీ దారి చూపిస్తుందని ఇప్పుడు అదే బాటలో ఉందని టీడీపీకి చెందిన సీనియర్ నేత ఒకరు కామెంట్ చేశారు. క్వాంటం టెక్నాలజీ అంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఈ కంప్యూటర్లు వేడెక్కకుండా ఉండటానికి భారీ స్థాయిలో కూలింగ్ సిస్టమ్ అవసరం. అయితే ప్రభుత్వం ఇప్పటికే వీటిన్నింటికీ ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెబుతోంది. కేంద్రం చేపట్టిన నేషనల్ క్వాంటం మిషన్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది.

# మెరుపు తీగలా మారిన అనిల్

నెల్లూరు, ఫిబ్రవరి 12 (భారతశక్తి):

మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కొంత రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత నుంచి ఆయన పెద్దగా పార్టీ కార్యక్రమాల్లోనూ, ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల్లోనూ కనిపించడం లేదు. వైసీపీ నేతలపై వరస కేసులు నమోదవుతుండటంతో తనను లక్ష్యంగా పెట్టుకుంటారన్న కారణంతోనే అనిల్ కుమార్ యాదవ్ కొంత పార్టీకి దూరంగా మసలు కుంటున్నారని తెలిసింది. మొన్నటి ఎన్నికల్లో కూటమి గెలవడంతో అక్కడ టిడిపి పట్టు బిగిస్తోంది. అయినా వైసీపీ నేతగా, మాజీ మంత్రిగా పార్టీకి పూర్వవైభవం తేవాలన్న ప్రయత్నం అనిల్ కుమార్ యాదవ్ చేయకపోవడాన్ని పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు. మొన్నటి ఎన్నికలకు ముందు, తర్వాత చాలామంది వైసీపీ నేతలు టిడిపిలో చేరిపోయారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక వెలుగు వెలిగిన మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఇప్పుడు ఎక్కడ కనిపించడం లేదు. అప్పుడప్పుడు కనిపించినా అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారు. అసలు ఆయన పార్టీలో ఉన్నారా? లేదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. సొంత సామాజిక వర్గం వారిని కాదని అనిల్ కుమార్ యాదవ్ కు ఛాన్స్ ఇచ్చారు జగన్. కానీ ఇప్పుడు వైసిపి సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంటే అనిల్ కుమార్ యాదవ్ కనిపించకపోవడం ఏమిటి అనే ప్రశ్న వినిపిస్తోంది. నెల్లూరు టౌన్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలిచిన అనిల్ కుమార్ యాదవ్ జగన్ కేబినెట్ లో మంత్రిగా చేరారరు. 2009లో కాంగ్రెస్ తరపున పోటీ చేశారు కానీ అనిల్ కుమార్ యాదవ్ గెలవలేదు. వైసీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరారు. 2014లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. కానీ టిడిపి అధికారంలోకి వచ్చింది. అయినా సరే దూకుడుగా వ్యవహరిస్తూ.. జగన్మోహన్ రెడ్డికి అత్యంత ఆప్తుడిగా మారిపోయారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడం.. నెల్లూరు నుంచి అనిల్ కుమార్ యాదవ్ గెలవడంతో మంత్రివర్గంలో ఆయనకు చాన్స్ ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. సొంత సామాజిక వర్గం నేతలు ఉన్న అనిల్ కుమార్ యాదవ్ కు ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. అయితే అనిల్ తీరుకు నిరసనగా చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడం కాదు.. నెల్లూరు జిల్లాలో దారుణ పరాజయం చూసింది. అనిల్ కుమార్ యాదవ్ ను నెల్లూరు నుంచి నరసరావుపేట ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. కూటమి హవాలో ఆయన ఓటమి తప్పలేదు. అయితే ఓడిపోయిన తర్వాత అనిల్ కుమార్ యాదవ్ పక్క రాష్ట్రాల్లో వ్యాపారాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే అప్పుడప్పుడు చుట్టూ చూపుగా వచ్చి వెళ్ళిపోతున్నారు తప్ప పార్టీకి పూర్తి సమయాన్ని కేటాయించడం లేదు. అందుకే అనిల్ కుమార్ యాదవ్ విషయంలో జగన్మోహన్ రెడ్డి వేరే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. యాక్టివ్ అయితే తప్ప వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ లేదని తేల్చి చెప్పినట్లు సమాచారం. అయితే తనకు నెల్లూరు అర్బన్ ఇన్చార్జి పదవి ఇవ్వాలని అనిల్ కుమార్ యాదవ్ కోరుతుంటే.. అందుకు జగన్మోహన్ రెడ్డి పెద్దగా ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. నెల్లూరు జిల్లాలో అనిల్ కుమార్ యాదవ్ యాక్టివ్ అయితేనే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ దక్కే అవకాశముంది.



# వైసీపీ ధీమా లెక్కేంటీ...

విశాఖపట్టణం ఫిబ్రవరి 12,(భారతశక్తి):

కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలకు సిద్ధమవుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా జమిలి ఎన్నికలు వస్తాయని, తెలంగాణ ఎన్నికలు 2029 లో జరుగుతాయని తెలిపారు. జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన కూడా జరగనుంది. తెలంగాణ లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2029కి ఆరేళ్లవుతుంది. అయితే ఆంధ్రప్రదేశ్ లో శాసనసభకు ఎన్నికలు సకాలంలోనే జరుగుతాయి. 2024లో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికలు జరిగాయి. అంటే తిరిగి 2029లో శాసనసభ ఎన్నికలు జరగాల్సి ఉంది. జమిలి ఎన్నికలు ఒక ఏడాది ముందుగా వస్తాయని వైసీపీ తొలుత భావించింది. కానీ ఫ్యాన్ పార్టీ ఆశలపై కేంద్ర ప్రభుత్వం నీళ్లు చల్లినట్లయింది. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటికే రాజకీయాలు వేడెక్కాయి. తొలి నుంచి రాజకీయ వాతావరణం వేడి వేడిగానే కొనసాగుతుంది. జగన్ కు కూడా జమిలి ఎన్నికల సమాచారం తెలియడంతోనే ఏడాదిన్నర తర్వాత మాత్రమే పాదయాత్ర చేయాలని నిర్ణయించారంటున్నారు. 2029 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడానికి 2027లో ఆయన పాదయాత్ర చేపట్టనున్నారు. తొలుత 2028 నాటికి జమిలి ఎన్నికలు వస్తాయని భావించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం 2029 కే దేశ వ్యాప్తంగా ఎన్నికలు జరపాలని నిర్ణయించడంతో ఏపీలో మరో మూడేళ్లకు కాని ఎన్నికలు జరగవు. దీంతో అధికార తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేశాం కాబట్టి, మిగిలిన హామీలను కూడా నెరవేర్చి ఎన్నికలకు వెళ్లేలా ప్లాన్ చేస్తుంది. అమరావతి, పోలవరం పనులను పూర్తి చేస్తే ప్రజలు కూటమికి మరోసారి పట్టం కడతారని అంటున్నారు. గుజరాత్ తరహాలో వరసగా అధికారం ఇస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్న నినాదంతో కూటమి ఈసారి ఎన్నికలకు సిద్ధమవుతుంది. వైసీపీ మాత్రం కూటమి ప్రభుత్వంలో అవినీతి, సంక్షేమ పథకాలు అందరికీ చేరకపోవడంతో పాటు కక్ష పూరిత రాజకీయాలు, అక్రమ కేసులు వంటివి నినాదాలుగా వెళ్లాలనుకుంటుంది. కాంగ్రెస్ కు, కమ్యునిస్టులకు ఈసారి కూడా అవకాశం ఉండదు. వచ్చే ఎన్నికల్లోనూ కూటమి, వైసీపీ మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందన్నది వాస్తవం. జమిలి ఎన్నికలు వస్తే ఏపీలో పెద్దగా తేడా ఉండదు. ఏపీలో ఎప్పటి నుంచో అసెంబ్లీ, పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి. తెలంగాణలో మాత్రం ఒక ఏడాది ముందు శాసనసభ, తర్వాత పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయి. జమిలి ఎన్నికల వల్ల ఏపీకి నష్టం లేదు. లాభం లేదు. మళ్లీ గెలవాలని టీడీపీ ప్రయత్నిస్తుంది. వైసీపీ గెలిచేందుకు సర్వశక్తుల ఒడ్డుతుంది.

================

# రాజ్యసభకు చింతకాయల విజయ్...

శ్రీకాకుళం, ఫిబ్రవరి 12, (భారతశక్తి):



ఆంధ్రప్రదేశ్ నుండి జూన్‌లో ఖాళీ కాబోతున్న నాలుగు రాజ్యసభ స్థానాలపై తెలుగుదేశం పార్టీలో అప్పుడే చర్చ మొదలైంది. కూటమి ప్రభుత్వానికి ఉన్న బలం దృష్ట్యా ఈ నాలుగు సీట్లు సులువుగా దక్కే అవకాశం ఉండటంతో, అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కసరత్తు మొదలుపెట్టారు. ఈ రేసులో ప్రస్తుతం టీడీపీ ఐటీ వింగ్ బాధ్యతలు చూస్తున్న యువనేత చింతకాయల విజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనకు ఎంపీ సీటు దాదాపు ఖరారైనట్లు పార్టీ వర్గాల్లో బలమైన ప్రచారం సాగుతోంది.

టీడీపీకి వెన్నెముకగా ఉండే బీసీ సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలనేది అధిష్టానం ఆలోచన. ఉత్తరాంధ్రలో బలమైన బీసీ నేతగా, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వారసుడిగా విజయ్‌కు మంచి గుర్తింపు ఉంది. ఇప్పటికే అయ్యన్నపాత్రుడు అసెంబ్లీ స్పీకర్‌గా గౌరవప్రదమైన హోదాలో ఉండగా, ఆయన కుమారుడికి ఢిల్లీ స్థాయిలో అవకాశం కల్పించడం ద్వారా ఉత్తరాంధ్రలోని బీసీలకు పెద్దపీట వేసినట్లు అవుతుందని చంద్రబాబు భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ ఐటీ వింగ్‌పై అనేక కేసులు నమోదైనప్పుడు విజయ్ వెనకడుగు వేయకుండా పోరాడారు. పార్టీ సోషల్ మీడియా సైనికులకు అండగా నిలవడమే కాకుండా, ప్రభుత్వంపై నిరంతరం డిజిటల్ అస్త్రాలను సంధించారు. ఈ క్రమంలో ఆయన అనేక రాజకీయ ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పార్టీ కోసం ఆయన పడిన కష్టానికి ప్రతిఫలంగా ఈ గౌరవం దక్కాలని మెజారిటీ నేతలు అభిప్రాయపడుతున్నారు. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత చంద్రబాబు దృష్టిలో కూడా విజయ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టింది. పార్లమెంటులో పార్టీ వాణిని బలంగా వినిపించేందుకు చదువుకున్న, విషయ పరిజ్ఞానం ఉన్న యువతను పంపాలని చంద్రబాబు యోచిస్తున్నారు. విజయ్ విదేశాల్లో చదువుకోవడం, ఆధునిక సాంకేతికతపై అవగాహన ఉండటం, జాతీయ రాజకీయాల పట్ల ఆసక్తి కలిగి ఉండటం ఆయనకు అదనపు అర్హతలుగా మారాయి. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేయడమే కాకుండా, రాష్ట్ర ప్రయోజనాల కోసం గొంతు వినిపించగల సత్తా విజయ్‌కు ఉందని పార్టీ పెద్దలు నమ్ముతున్నారు. అదే సమయంలో చింతకాయల విజయ్ అభ్యర్థిత్వానికి ఉన్న అతిపెద్ద ప్లస్ పాయింట్ నారా లోకేష్‌తో ఉన్న సాన్నిహిత్యం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు, ముఖ్యంగా లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో ఐటీ వింగ్ ద్వారా సోషల్ మీడియాలో పార్టీ గొంతుకను బలంగా వినిపించడంలో విజయ్ కీలక పాత్ర పోషించారు. లోకేష్ వ్యక్తిగత బృందంలో ఒకరిగా ఉంటూ, డిజిటల్ క్యాంపెయినింగ్‌ను విజయవంతంగా నడిపించడమే కాకుండా, పార్టీ కేడర్‌ను సమన్వయం చేయడంలో తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. ఈ విధేయతే ఆయనను రేసులో ముందు నిలబెడుతోందని టీడీపీ వర్గాలుచెబుతున్నాయి. ప్రస్తుతానికి అధికారికంగా ఎటువంటి ప్రకటనా రానప్పటికీ, విజయ్ పేరుపై చంద్రబాబు , లోకేష్ ఇప్పటికే ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ సీనియర్లకు, యువతకు మధ్య సమతుల్యత దెబ్బతినకుండా ఈ ఎంపిక ఉండబోతోంది. అన్నీ అనుకూలిస్తే, రాజ్యసభలో టీడీపీ తరపున చింతకాయల విజయ్ అడుగు పెట్టడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

=============

# ఏపీ పరిస్థితి ఇంత దారుణమా...

గుంటూరు, ఫిబ్రవరి 12, ((భారతశక్తి):

ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. అయితే ఇంతలో కేంద్రం పార్లమెంట్‌లో పెట్టిన ఓ నివేదిక ఇక్కడ రాజకీయ చిచ్చు రేపింది. ఆంధ్రప్రదేశ్‌లోని రైతు అప్పుల ఊబిలో ఉన్నాడని చెప్పిన రిపోర్టు సంచలనంగా మారుతోంది. అయితే దీన్ని అధికార ప్రతిపక్షాలు ఇరువురు కూడా బురద చల్లేలా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. దేశానికి వెన్నెముక రైతు అని గర్వంగా చెప్పుకునే రైతు అప్పుల భారతంతో కుంగిపోతున్నాడని పార్లమెంట్‌లో కేంద్రం కీలక నివేదిక బయటపెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోని రైతు కుటుంబాలు దేశంలోనే అత్యధిక అప్పుల భారంతో ఉన్నాయనేది చేదు నిజం. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాలు చూస్తుంటే ఏపీలో రైతు దీనస్థితి ఏంటో కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. ఫిబ్రవరి 10న లోక్‌సభలో ఏపీ రైతు అప్పులపై ఒక కీలక చర్చ జరిగింది. దీనిపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ప్రకటన ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో రైతులు ఎంతటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారో దేశానికి స్పష్టమైంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న రైతులతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ రైతుల అప్పులే అత్యధికంగా ఉన్నట్టు తేలింది. మంత్రి శివరాజ్ సింగ్ వెల్లడించిన గణాంకాల ప్రకారం జులై 2018-జూన్ 2019 మధ్య కాలానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని ఒక సగటు రైతు కుటుంబం అప్పు 2,35, 554 రూపాయలుగా ఉంది. ఇది కేవలం ఒక అంచనా మాత్రమే కాదు. ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన వాస్తవం. అంటే మన రాష్ట్రంలో ఒక సాధారణ రైతు కుటుంబం సుమారు రెండు లక్షల ముప్పై ఐదు వేల రూపాయల అప్పుతో కాలం వెళ్లదీస్తోంది. పక్కనే ఉన్న తెలుగు రాష్ట్రం తెలంగాణతో పోల్చి చూసినా ఏపీ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. తెలంగాణలో ఒక రైతు కుటుంబం సగటు అప్పు 1,52, 113రూపాయలుగా ఉంది. అంటే ఏపీ కంటే ఇది చాలా తక్కువ. భారత్‌లో మొత్తం మీద ఒక రైతు కుటుంబం సగటు అప్పు కేవలం 74, 121 రూపాయలు మాత్రమే. జాతీయ సగటు 74వేలు ఉంటే ఏపీలో అది 2.35 లక్షలకు చేరడం ఆందోళనకరంగా ఉంది. దేశ సగటు కంటే ఏపీలో రైతులు దాదాపు మూడు రెట్లు ఎక్కువ అప్పుల్లో ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి. కేంద్ర మంత్రి ప్రకటన ద్వారా అప్పుల భారం అయితే తెలిసింది కానీ, సామాన్యంగా రైతుకు ఈ తిప్పలు ఎందుకు వస్తాయో అందరికి తెలిసిందే. పెట్టుబడి పెరగడం, గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రకృతి వైపరిత్యాలు వంటి ఎన్నో కారణాలు రైతును అప్పుల వైపు నెడుతున్నాయి. ఒక్కో రైతు కుటుంబంపై ఇంత భారీ స్థాయిలో అప్పు ఉండటం అనేది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. పార్లమెంట్ సాక్షిగా బయటపడిన ఈ లెక్కలు ఇటు టీడీపీపై వైసీపీ దుమ్మెత్తి పోస్తుంటే, వారి హయాంలోనే ఇలాంటి లెక్కలు వెలుగు చూశాయని అప్పటి ప్రభుత్వం చేతకానితనం వల్లే ఇదంతా జరిగిందని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. మొత్తానికి ఈ కేంద్ర విడుదల చేసిన లెక్కలను ఇరు వర్గాలు వాడుకుంటున్నారు.

# ముందుకు సాగని ఉస్తాద్ భగత్ సింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 12, ( (భారతశక్తి):

మరో 40 రోజుల్లో పవర్ స్టార్ సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. పవర్ స్టార్ సినిమా అంటే ఆ హడావిడి ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అభిమానులు ఆయన సినిమా విడుదలని ఒక పండుగ లాగా జరుపుకుంటారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రాన్ని కూడా ఆ రేంజ్ సెలబ్రేట్ చేసుకోవడానికి అభిమానులు సిద్ధంగానే ఉన్నారు. కానీ మేకర్స్ మాత్రం నత్త నడకన ప్రొమోషన్స్ చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన రెండు గ్లింప్స్ వీడియోలు విడుదలై దాదాపుగా రెండేళ్లు కావొస్తుంది. ఇక ఆ తర్వాత డిసెంబర్ నెలలో ఈ చిత్రం నుండి 'దేఖ్లేంగే సాలా' అనే పాటని విడుదల చేశారు మేకర్స్. ఈ పాటలో పవన్ కళ్యాణ్ వేసిన స్టెప్పులకు ఫ్యాన్స్, ఆడియన్స్ నుండి సెన్సేషనల్ రెస్పాన్స్ వచ్చింది. కానీ ట్యూన్ మాత్రం చాలా యావరేజ్ రేంజ్ లో ఇచ్చాడు మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్. ఈ పాట సినిమా పై అంచనాలు పెంచలేదు, అలా అని అంచనాలు తగ్గించలేదు. ఇలాంటి కంటెంట్ వల్ల సినిమాకి ఒరిగేది ఏమి లేదు. ఒక బ్లాస్టింగ్ కంటెంట్ రావాలి, అప్పుడే హైప్ వస్తుంది అని విశ్లేషకులు అంటున్నారు. ఈ చిత్రం నుండి రెండవ పాట కోసం ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. శివరాత్రికి వస్తుందని అనుకున్నారు కానీ, అప్పటికి కేవలం ఈ పాటకు సంబంధించిన పోస్టర్ ని మాత్రమే విడుదల చేస్తారట. మేకర్స్ ప్రొమోషన్ కంటెంట్ ని వదిలే విషయంలో ఇంత అలసత్వం చూపిస్తున్నారు. ఇది పక్కన పెడితే కనీసం బిజినెస్ ని కూడా మొదలు పెట్టడం లేదు. రెండు నెలల తర్వాత విడుదల అవ్వబోయె రామ్ చరణ్ 'పెద్ది' మూవీ బిజినెస్ కూడా మొదలు పెట్టేసారు, కానీ మేకర్స్ 'ఉస్తాద్ భగత్ సింగ్' బిజినెస్ ని మాత్రం మొదలు పెట్టలేదు. ఎందుకంటే ఒక్కో ప్రాంతానికి నిర్మాతలు డిమాండ్ చేస్తున్న రేట్స్ తారాస్థాయిలో ఉన్నాయి. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం కేవలం ఒక రొటీన్ కమర్షియల్ సినిమా మాత్రమే. ఇలాంటి సినిమాలకు పాన్ ఇండియా రేంజ్ బిజినెస్ చేయాలంటే ఎలా చెప్పండి?, 43 రోజుల్లో సినిమా రిలీజ్ పెట్టుకొని, ఇప్పటి వరకు ఓవర్సీస్ డీల్ క్లోజ్ చేయలేదు. సాధారణంగా ఈమధ్య కాలం లో ఓవర్సీస్ అడ్వాన్స్ బుకింగ్స్ నెల రోజుల ముందే మొదలు అవుతున్నాయి. కానీ ఈ చిత్రానికి నెల రోజుల ముందు ఇంకా బిజినెస్ డీల్ క్లోజ్ అవ్వలేదు. ఎవరు విడుదల చేయబోతున్నారు అనే విషయం ఎవరికీ తెలియదు. అలా ఉంది పరిస్థితి. త్వరగా బిజినెస్ ని మొదలు పెట్టి, మిగిలిన ఫార్మాలిటీస్ ని పూర్తి చేస్తే కానీ ఈ చిత్రం పై ఒక అంచనాకు రాలేము అంటూ చెప్తున్నారు విశ్లేషకులు.

=============

# తెరపైకి షుగర్ మమ్మీలు...

హైదరాబాద్, ఫిబ్రవరి 12, (భారతశక్తి):

ఒక మనిషి ప్రకృతి సిద్ధంగా నడుచుకుంటే అన్ని బాగానే ఉంటాయి. విధానాలపరంగా వ్యవహరిస్తే ఇబ్బందులు అనేవి తలెత్తకుండా ఉంటాయి. అదే మనిషి డబ్బు మాయలో పడి.. స్టేటస్ సింబల్ మాయలో పడి ప్రకృతికి విరుద్ధంగా నడుచుకుంటే.. ఆ తర్వాత అన్ని ప్రతికూల ఫలితాలు వస్తుంటాయి. డబ్బు అనేది మనిషిని ఆడిస్తూ ఉంటుంది. అవసరాలనేవి మనిషివిని మరోవైపు నడిచేలా చేస్తాయి. డబ్బు లేకుండా మనిషి జీవించలేడు. అవసరాలు తీరకుండా మనుగడ సాగించలేడు. డబ్బు అనేది కొంతమందికి ప్రాధాన్యమైన అవసరమైతే.. మరికొందరికి జీవితం. ప్రాధాన్యమైన అవసరం లాగా డబ్బులు భావించేవారు జీవితాన్ని సుఖవంతంగా సాగిస్తుంటారు. కానీ జీవితమే అనుకునే వారు మాత్రం డబ్బు చుట్టూ పరిభ్రమిస్తుంటారు. డబ్బు చుట్టూ పరిభ్రమించడం మొదలైతే ఆ తర్వాత మనిషి తన ఆకృతిని.. తన అలవాట్లను.. తన వ్యవహారాలను పూర్తిగా మార్చుకోవాల్సి ఉంటుంది. డబ్బు కోసం "మనీ"షిగా మారాల్సి ఉంటుంది. డబ్బు అనేది మనిషిని ఆడించిన తర్వాత.. మనిషి చాలా వాటికి దూరమవుతూ ఉంటాడు. అందులో సంసార జీవితం కూడా ఉంటుంది. డబ్బు, కెరియర్, ఆస్తుల సంపాదన వ్యవహారాలు మనిషిని ఊపిరి తీసుకోకుండా చేస్తున్న నేపథ్యంలో చాలామంది 30 సంవత్సరాలు దాటేవరకు కూడా పెళ్లి చేసుకోవడం లేదు. గతంలో ఈ జాబితాలో పురుషులు ఉండేవారు. ఇప్పుడు మహిళలు కూడా చేరిపోయారు. పురుషులలో రిచ్ డాడిస్ అనేవారు విపరీతమైన కరువులో ఉంటారు. సో కాల్డ్ రిచ్ షుగర్ డాడీస్ 40 నుంచి 50 సంవత్సరాలు వచ్చేదాకా పనిచేస్తూనే ఉంటారు. కెరియర్ కోసం కష్టపడుతూనే ఉంటారు. ఎప్పుడో వారి వయసులో 15 సంవత్సరాల ప్రాయం ఉన్నప్పుడు కోరికలు మొదలవుతాయి. కనీసం 30 సంవత్సరాలు వచ్చేదాకా పెళ్లి కూడా చేసుకునే అవకాశం ఉండదు. వివాహం తర్వాత కోరికలు తీసుకోవడానికి సమయం ఉండదు. జుట్టు తెల్లగా అయ్యేవరకు సంపాదనలోనే అసలు కాలం కాస్త పూర్తవుతుంది. అప్పటికి వయసు అయిపోతుంది. శరీరానికి షుగర్ అనేది తగిలిన తర్వాత.. ఆ డాడి లకు షుగర్ బిడ్డలు తగులుతుంటారు. అందుకే షుగర్ కావాలని శరీరం కోరుతూ ఉంటుంది. వివాహం చేసుకొని డాడీలు అవ్వకుండా.. వయసు పెరిగిన తర్వాత షుగర్ కోసం తాపత్రయపడుతుంటారు. ఇక్కడ ఈ షుగర్ దాడిలతో వ్యవహారం సాగించేవారు కూడా అదే సమస్యతో ఉంటారు. షుగర్ డాడి ల గురించి తెలుసుకున్నాం కదా.. ఇప్పుడు షుగర్ మమ్మిల గురించి కూడా మాట్లాడుకోవాలి. పైన చెప్పిందే వీరికి కూడా వర్తిస్తుంది. ఎందుకంటే నేటి కాలంలో ఆకాశంలో సగం.. అన్నిట్లోనూ సగం అని మహిళలు గట్టి నినాదంతో ముందుకు వెళ్తున్నారు. కెరియర్లో స్థిరపడిన తర్వాత అన్నీ అనుకుంటున్నారు. కానీ అప్పటికే సగం వయసు దాటిపోతుంది. ఇక అప్పుడు పెళ్లి చేసుకోవాలనే కోరిక కూడా చాలామందిలో చచ్చిపోతోంది. ఫలితంగా వారు షుగర్ మమ్మీలుగా మారిపోతున్నారు. దేహం పోరు పెట్టినప్పుడు.. తప్పదు కాబట్టి వారు అదేదారిలో వెళ్తున్నారు. ఇది నైతికమా? అనైతికమా? అనే ప్రశ్నలకు ఆస్కారం లేని వ్యవహారం. దాహం వేస్తే నీళ్లు తాగుతాం. ఆకలి వేస్తే ఆహారం తింటాం. నిద్ర వస్తే పడుకుంటాం. దేహంలో సెగలు రగిలితే.. వాటిని తగ్గించుకునే ప్రయత్నం చేస్తాం. ఇందులో నీతికి.. ఇతర సిద్ధాంతాలకు తావులేదు. షుగర్ డాడి అనేది వెస్ట్రన్ కల్చర్. షుగర్ మమ్మి కూడా అదే బాపతు. కాకపోతే ఈ కల్చర్ మన హైదరాబాద్ నగరంలో విస్తృతంగా ఇప్పుడు కనిపిస్తోంది. వీటికోసం కొన్ని సంస్థలు కూడా పనిచేస్తున్నాయి. కాకపోతే అవి బయటపడవు. షుగర్ డాడిల కంటే షుగర్ మమ్మిలే భారీగా ఖర్చు పెడతారట. ఇదేదో మేం చెబుతున్న మాట కాదు.. ఈ వ్యవహారం సాగిస్తున్న కొన్ని సంస్థలు చెబుతున్న నగ్న సత్యాలు. ఇంకా లోతుగా ఈ సబ్జెక్టు గురించి చెప్పొచ్చు. కాకపోతే అదంతా సెన్సార్ లో ఉంటుంది.

# కర్ణాటక రాజకీయాల్లో తమన్నా, పూజా హెగ్డే. మధ్య పోటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 12,(భారతశక్తి):

సినీ రంగం లో తమన్నా, పూజ హెగ్డే లకు ఉన్న క్రేజ్ ఎలాంటిదో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రతీ ఏటా ఎంతో మంది యంగ్ హీరోయిన్లు ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టొచ్చు, కానీ వీళ్లిద్దరి క్రేజ్ మాత్రం ఇసుమంత కూడా తగ్గలేదు. హిట్, ఫ్లాప్ లతో సంబంధం లేకుండా, వరుసగా సినిమాలు చేస్తూ దూసుకెళ్తున్నారు ఈ ఇద్దరు హీరోయిన్స్. అయితే వీళ్లకు ఏ మాత్రం సంబంధం లేని రాజకీయాలు, ఇప్పుడు వీళ్లిద్దరు చుట్టూ తిరుగుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యం లో ఉండే మైసూర్ శాండిల్ సోప్ కి బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించేందుకు తమన్నా ని ఎంపిక చేశారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా మైసూర్ శాండిల్ సోప్స్ కి ఉన్న క్రేజ్ మామూలుది కాదు. ఈమధ్య కొత్త ప్రొడక్ట్స్ కారణంగా ఈ బ్రాండ్ కి కాస్త క్రేజ్ తగ్గింది. అందుకే ప్రభుత్వం ఈ సోప్ ను రీ బ్రాండింగ్ చేస్తూ, నేడు లాంచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. అయితే ఈ బ్రాండ్ కి తమన్నా ని ఎంపిక చేయడం పై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎంతో మంది హీరోయిన్లు ఉన్నారు, వాళ్ళని బ్రాండ్ అంబాసిడర్ గా ఎంచుకోవచ్చు కదా, ఎందుకు తమన్నా ని ప్రత్యేకించి తీసుకున్నారు. కర్ణాటక లో పుట్టిన పెరిగిన పూజా హెగ్డే ని ఎందుకు ఎంచుకోలేదు?, ఆమెతో పాటు రష్మిక మందాన,రుక్మిణి వాసంత్, శ్రీనిధి శెట్టి వంటి పాన్ ఇండియన్ స్టార్ హీరోయిన్లందరూ కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారే. క్రేజ్, ఫాలోయింగ్, ఫేమ్ విషయంలో వీళ్ళు తమన్నా కి ఏ మాత్రం తీసిపోరు. అయినప్పటికీ వీళ్ళలో ఎవరో ఒకరిని ప్రభుత్వం ఎందుకు ఎంచుకోలేదు అంటూ నిలదీస్తున్నారు ప్రతి పక్ష పార్టీ కి చెందిన నేతలు. బీజేపీ పార్టీ నాయకులూ కూడా ఈ విషయం లో ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో తప్పుబడుతున్నారు. స్థానిక తారలను విస్మరించడం స్థానిక కాంగ్రెస్ నేత కన్నడ వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శమని అంటున్నారు. అలా తమన్నా, పూజా హెగ్డే , రష్మిక వంటి హీరోయిన్ల పేర్లు రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా అక్కడి నేతలు తీస్తున్నారు. అయితే కర్ణాటక ప్రభుత్వం మాత్రం ఈ విమర్శలను లెక్క చేయడం లేదు, వాళ్లకు చేయాలనుకున్న పనులు చేస్తూ ముందుకెళ్తున్నారు. ఈ నిర్ణయం పూర్తిగా వ్యాపార కోణం లో తీసుకున్నదే, ఇందులో భావోద్వేగాలకు చోటు లేదు, ప్రతిపక్షాలు ఈ అంశాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేయాలనీ అనుకోవడం వాళ్ళ దిగజారుడు తనానికి నిదర్శనం అంటూ మండిపడుతున్నారు కాంగ్రెస్ నేతలు.



# విశ్వవిద్యాలయాల్లో తుకిడే గ్యాంగులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12, (భారతశక్తి):

ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ భారత వ్యతిరేక కార్యకలాపాలకు కేంద్రంగా ఉంటూ వచ్చింది. తుకిడే గ్యాంగులు ఇందులోనే ఉన్నాయి. పాకిస్తాన్ అనుకూల నినాదాలు బలంగా వినిపించేవి. అక్కడి ప్రొఫెసర్లు కూడా తప్పుడు చరిత్రను నేర్పించారు. పాలస్తీనాకు అనుకూలంగా విద్యార్థుల మైండ్ మార్చి రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. అయితే ఈ యూనివర్సిటీలో కనీ విని ఎరుగని సంఘటన జరిగింది. ఈ యూనివర్సిటీలో విద్యార్థుల ఇష్టారాజ్యం కొనసాగేది. కానీ, గతంలోలాగా ఇప్పుడు నడదు అని అధికారులు షాక్ ఇచ్చారు. గతేడాది నవంబర్ 20న యూనివర్సిటీ లైబ్రరీలో విద్యార్థులు ఫేసియల్ రికగ్నిషన్ వ్యవస్థను ధ్వంసం చేశారు. ఆవేశ ప్రసంగాలు చేశారు. అడ్డుకోబోయిన ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లపై దాడి చేశారు. అయితే తాము ఏం చేసినా చెల్లుతుందనే విధంగా వ్యవహరించారు. కానీ, అధికారులు దీన్ని తీవ్రంగా తీసుకుని ప్రాక్టోరియల్ విచారణ ఆదేశించారు. విచారణ నివేదిక అందిన తర్వాత అధికారులు చర్యలు మొదలు పెట్టారు. ఫిబ్రవరి 8న ఐదుగురు విద్యార్థులపై ఏడాది రస్టికేషన్ విధించారు. వీరిలో స్టూడెంట్స్ యూనియన్ సెక్రటరీ గోపిక బాబు, అధ్యక్షురాలు అతిథి మిశ్రా, సునీల్ యాదవ్, డానిస్ అలీ, నితీష్ కుమార్ ఉన్నారు. ఫిబ్రవరి 13 వరకు వర్సిటీ ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆదేశించారు. శిక్ష పూర్తయిన తర్వాత కూడా రూ. 19 వేల జరిమానా చెల్లించాలని పేర్కొన్నారు. జేఎన్‌యూలో భారత వ్యతిరేక కార్యకలాపాలు, తప్పుడు చరిత్ర బోధన, పాక్ అనుకూల నినాదాలు గతంలో సంచలనం చేశాయి. అధికారులు రాజకీయ జోక్యాలు ఆగమాత్రమే కారణంగా కఠిన చర్యలు తీసుకున్నారు. ఆశ్రయం ఇచ్చినవారిపై కూడా చర్యలు హెచ్చరిక. అయితే విద్యార్థులపై చర్యలను నిరసిస్తూ ఒకరోజు బంద్ పాటించారు. కానీ, ఈ చర్యలు జేఎన్‌యూలో మార్పు తీసుకువస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

# అన్నీ సినిమాలు కలిపి స్వయంభూ...

హైదరాబాద్, ఫిబ్రవరి 12,(భారతశక్తి):

తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఇప్పటివరకు ఎవరికీ సాధ్యం కానీ రీతిలో వరుస సినిమాలను చేస్తూ ముందుకు దూసుకెళ్తున్న వాళ్ళలో మన స్టార్ హీరోలు ముందు వరుసలో ఉన్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే కొంతమంది యంగ్ హీరోలు సైతం స్టార్ హీరోల బాటపడుతున్నారు. పాన్ ఇండియా మార్కెట్ ను కొల్లగొట్టడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతుండటం విశేషం. 'కార్తికేయ 2' సినిమాతో పాన్ ఇండియా మార్కెట్ ని కొల్లగొట్టిన నిఖిల్ సిద్ధార్థ ప్రస్తుతం 'స్వయంభు' అనే సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సంవత్సరం సమ్మర్ లో ఈ మూవీని రిలీజ్ చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటివరకు నిఖిల్ సిద్దార్థ్ సాధించిన విజయాలు ఒకెత్తయితే ఇప్పుడు సాధించబోయే విజయాలు మరొక ఎత్తుగా మారబోతున్నాయి. అయితే ఈ సినిమా నుంచి ఈరోజు టీజర్ రిలీజ్ అయింది. టీజర్ ని కనుక మనం అబ్జర్వ్ చేసినట్లయితే తెలుగు సినిమాలన్నింటిని కలిపి ఈ సినిమాను తీశారు అనే డౌట్ మనకు కలుగుతుంది. ఇక ఈ విషయం మీద మేకర్స్ ఎలాంటి స్పందనను తెలియజేయనప్పటికి విమర్శకులు మాత్రం ఈ సినిమా మీద భారీ విమర్శలైతే చేస్తున్నారు? ఇక ఎందుకని అలాంటి ఇతర సినిమాల రిఫరెన్స్ లు తీసుకున్నారనేది ఎవరికి అర్థం కావడం లేదు. మగధీర, బాహుబలి లాంటి భారీ రేంజే సినిమాల ఇన్స్పిరేషన్ తో ఈ సినిమా తెరకెక్కుతుంది.

# మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి:

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 12 (భారతశక్తి):

జిల్లాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన ఈ వివరాలను వెల్లడించారు. కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా, ఎన్నికల నియమావళి ప్రకారం నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. నేడు ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, మొత్తం రెండు రౌండ్లలో 60 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి టేబుల్‌కు ఒక సూపర్వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో ఆబ్జర్వర్‌ను నియమించడంతో పాటు అవసరమైన రిజర్వ్ సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి ఎన్నికల నియమావళి, ఓట్ల లెక్కింపు విధానం, అనుసరించాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సమగ్ర శిక్షణ అందించామని వివరించారు. ప్రతి దశలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించినట్లు తెలిపారు. ఎన్నికల



అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీల్ చేసి భద్రపరిచినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రారంభానికి ముందు అభ్యర్థులు లేదా వారి ఎన్నికల ఏజెంట్ల సమక్షంలోనే స్ట్రాంగ్ రూమ్‌లను తెరవనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం సీసీటీవీ పర్యవేక్షణలో నిర్వహించబడుతుందని, ప్రతి టేబుల్ వద్ద పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండేందుకు ప్రత్యామ్నాయ జనరేటర్ సౌకర్యం కల్పించామని, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, వైద్య సహాయం వంటి మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ..

కౌంటింగ్ కేంద్రం వద్ద మూడు స్థాయిల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. అనుమతిపత్రాలు కలిగిన సిబ్బంది, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు మరియు అధీకృత మీడియా ప్రతినిధులను మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా బృందాలను మోహరించినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం పరిధిలో చట్టవ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయుటకు సెక్షన్ 163–బి అమలులో ఉంటుందని తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం ఐదుగురికిపైగా వ్యక్తులు గుమికూడరాదని, అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వదంతులు, అసత్య ప్రచారాలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక సైబర్ నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు సహకరించి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, పాల్వంచ డిఎస్పి సతీష్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బృందావన్ కాలనీలో భారీ చోరి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 12: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బృందావన్ కాలనీలో భారీగా చోరీ జరిగింది. ఇంటికి వేసిన తాళాలు పగలగొట్టి అందులోకి చొరబడి 16 తులాల బంగారు ఆభరణాలతో పాటు వెండి ఆభరణాలు, నగదును దోచుకెళ్లిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబీకులతో పాటు స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి బృందావన్ కాలనీలో నివాసం ఉండే ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శ్రీరేఖ బుధవారం రాత్రి ఇంటికి తాళం వేసి తన తల్లి గారి దగ్గరకు దేవునిపల్లికి వెళ్ళింది. గురువారం ఉదయం శ్రీరేఖ ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా, ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. అలాగే బీరువాను పగులగొట్టి అందులో ఉన్న 16 తులాల బంగారం, 3 తులాల వెండి, 3 వేల రూపాయల



నగదును దొంగలు అపహరించుకు వెళ్లారని పోలీసులకు సమాచారం అందజేసింది. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అలాగే ఇంటి చుట్టు ప్రక్కల అమర్చిన సిసి ఫుటేజ్ లను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జిల్లా స్థాయి చీఫ్ మినిస్టర్స్ కప్--2025 (2వ ఎడిషన్) ఘనంగా ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 12: కామారెడ్డి జిల్లా స్థాయి చీఫ్ మినిస్టర్స్ కప్--2025 టోర్నమెంట్ల 2వ ఎడిషన్ గురువారం ఇందిరాగాంధీ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ , అదనపు కలెక్టర్ విక్టర్ లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడలు యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. చీఫ్ మినిస్టర్స్ కప్ వంటి పోటీలు గ్రామీణ పట్టణ ప్రాంతాల యువతకు తమ ప్రతిభను చాటుకునే వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించి, జిల్లాకు కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

దనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడాకారులు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని



సూచించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడా విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు..ఈ సందర్భంగా ఈ క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ మొదటగా కబడ్డీ ఆడుతూ పోటీలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో క్రీడా అధికారులు వెంకటేశ్వర్లు గౌడ్, ఆర్ డి ఓ వీణ, తహసిల్దార్ జనార్ధన్, పీడి మెప్మ , కోచ్,లు, క్రీడాకారులు , తదితరులు పాల్గొన్నారు.

# కెవైసి సురక్షిత బ్యాంకింగ్ వైపు మీ మొదటి అడుగు

భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 12 (భారతశక్తి):కెవైసి మీ బ్యాంక్ ఖాతాను సురక్షితంగా ఉంచడంలో మీ మొదటి అడుగు అనే ఇతివృత్తంతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఈ నెల 9 నుండి నేటి వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తోందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వి రామిరెడ్డి అన్నారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు గురువారం అన్నపురెడ్డి పల్లి మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామ పంచాయితీలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కెవైసి అప్ టు డేట్ చేసుకోవాలని సూచించారు. కెవైసి కి అవసరం అయిన డాక్యుమెంట్లు, అవి బ్యాంక్ ఖాతా కు అనుసంధానం చేయడం వల్ల కలిగే లాభాల గురించి ప్రజలకు వివరించారు. ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతా అన్నిటిలో పేరు, చిరునామా, పుట్టిన తేదీ ఒకేలా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆధార్ కు మొబైల్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు.ఇప్పుడు ఒక బ్యాంక్ లో కెవైసి అప్డేట్ చేయడం ద్వారా మిగిలిన అన్ని బ్యాంకులలో కెవైసి అప్డేట్ చేసే వ్యవస్థ సికెవైసి అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ విధానం లో 14 అంకెల సికెవైసి నంబర్ జారీ చేస్తారన్నారు. ఈ నెంబర్ మిగిలిన అన్ని బ్యాంకులలో ఉన్న మీ ఖాతాకు అనుసంధానం చేయడం ద్వారా మీ కెవైసి అప్డేట్ అవుతుందని తెలిపారు. తిరిగి అన్ని డాక్యుమెంట్లు సమర్పించే అవసరం లేదన్నారు. 7799022129 కి కస్టమర్ రిజిస్టర్డ్ మొబైల్ నుండి మిస్డ్ కాల్ చేయడం ద్వారా తన సి . కె.వై.సి. నంబర్ సులభంగా తెలుసుకోవచ్చు అని తెలిపారు. కె. వై. సి. పేరుతో ఫోన్ ద్వారా, ఆన్లైన్ లింకుల ద్వారా జరుగుతున్న మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇతరులు మీ ఖాతాని ఉపయోగించే అవకాశం ఇవ్వవద్దని, వారు చేసే మోసపూరిత లావాదేవీలకు మీరే బాధ్యులుగా ఉంటారని



తెలియజేశారు. అలా చేస్తే మీరు మనీ మ్యూల్ గా పరిగణించబడి చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి వస్తుందని తెలియచేశారు. మీ బ్యాంక్ ఖాతా కు సంబంధించిన వివరాలు, ఓ. టి. పి, ఏ. టి. యం. పిన్ నంబర్, నెట్ బ్యాంకింగ్ పాస్వర్డ్ ఎవరికీ తెలియనివ్వద్దన్నారు. తెలియని లింకులు నొక్కొద్దు – మోసగాళ్ళకు చిక్కొద్దు అంటూ ప్రజలకు అవగాహన కలిగించారు. ఒక వేళ, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కి ఫోన్ చేసి కంప్లైట్ చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకాలైన ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన పథకాలు అతి తక్కువ ప్రీమియం తో అందరికీ అవసరం అయిన, అందుబాటులో ఉన్న పథకాలు అంటూ వాటి వివరాలు తెలియచేశారు. గ్రామ సర్పంచ్ నాగభూషణం మాట్లాడుతూ తమ గ్రామ ప్రజలు అవగాహనతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగభూషణం, ఉప సర్పంచ్ నరేష్ బాబు, కార్యదర్శి .నరేష్, సి. ఎఫ్ ఎల్. దమ్మపేట కౌన్సిలర్ ప్రమీల, వివిధ శాఖల సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సంత్ సేవలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి:

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 12 (భారతశక్తి) సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 20న ఖానాపూర్‌లో జరగనున్న జయంతి కార్యక్రమాల నిర్వహణపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఖానాపూర్ పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమాలకు హాజరయ్యే ప్రజలను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, పారిశుధ్యం తదితర వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ప్రాంగణంలో అంబులెన్స్‌తో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావించి తగిన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని



సూచించారు. భద్రతా దృష్ట్యా అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్న కళ్యాణి, డి టి డి ఓ అంబాజీ, ఇతర అధికారులు, ఉత్సవ సమితి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్దీపకం వర్క్ బుక్ టు లోని అంశాలు ప్రతి పిల్లవానికి అర్థమయ్యేలా బోధించాలి:

## ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్

దుమ్ముగూడెం/భద్రాచలం ఫిబ్రవరి 12 (భారతశక్తి): గిరిజన సంక్షేమ ఆధ్వర్యంలో నడపబడుతున్న జిపిఎస్ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు పునాది నుండే విద్యావ్యవస్థ బలోపేతం కావడానికి ఉద్దీపకం వర్క్ బుక్ టు లోని అంశాలు ప్రతి పిల్లవానికి అందరికీ అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. గురువారం దుమ్ముగూడెం మండలంలోని మారుమూల దట్టమైన అటవీ ప్రాంతంలోని చత్తీస్గడ్ రాష్ట్రంకు ఆనుకొని ఉన్న లింగాపురం, రాజ గుంపు జిపిఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలతో కాసేపు ఉపాధ్యాయుని పాత్ర అనంతరం విద్యార్థి పాత్ర పోషించి ఉద్దీపకం వర్క్ బుక్ సంబంధించిన అంశాలు పిల్లలకు బోధిస్తున్న తీరును, తానే స్వయంగా పిల్లల చేత బోర్డుపై వ్రాయించారు. వర్క్ బుక్ లోని ప్రతి అంశం పిల్లల ద్వారా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. పిల్లలు ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు, చతుర్వేద ప్రక్రియలలో వెనుకబడి ఉన్నట్లు ఆయన గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. నెల రోజుల తర్వాత తప్పనిసరిగా ఈ పాఠశాలను సందర్శిస్తానని, ఈ లోపల పిల్లలందరూ ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు తప్పనిసరిగా ప్రతి పిల్లవానికి తెలిసి ఉండాలని హెచ్చరించారు. ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వహణ ప్రతిరోజు సక్రమంగా జరగాలన్నారు. పిల్లలందరూ పాఠశాలకు వచ్చేలా



సంబంధిత ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రతిరోజు పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని, ఉపాధ్యాయులు ప్రతిరోజు వచ్చేలా చూడాలని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పై అధికారులు దృష్టికి తీసుకొని రావాలని తెలిపారు. ఈసారి ఈ గ్రామం సందర్శించినప్పుడు తప్పనిసరిగా గ్రామంలోని పెద్దలు, పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానన్నారు. సంబంధిత ఎస్సిఆర్పి క్రమం తప్పకుండా ఉద్దీపకంలోని ప్రతి అంశం ఉపాధ్యాయులు పిల్లలకు బోధిస్తున్నది లేనిది తనిఖీ చేయాలని, మారుమూల ప్రాంతాలలో ఉన్న జిపిఎస్ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి ఆర్ పి విటల్ బాబు, ఉపాధ్యాయులు ముత్తమ్మ, చరణ్ కుమార్, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నివారణ పై ప్రజలకు అవగాహన కల్పించాలి:

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.లక్ష్మణ్ నాయక్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 12 (భారత శక్తి):ప్లాస్టిక్ ఉపయోగ వాటి వల్ల అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని నూకల రామచంద్రారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి లక్ష్మణ్ నాయక్ తెలిపారు.గురువారం మండల కేంద్రంలోని కంపాలపల్లి గ్రామంలో ఏడు రోజుల ఎన్ఎస్ఎస్ శిక్షణ శిబిర ముగింపు కార్యక్రమానికి ఆర్ ఎం ఓ డాక్టర్ జగదీష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విద్యతోపాటు సేవా దృక్పథం కలిగి ఉండాలని



సమాజంలో జరుగుతున్న అనర్థాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు. వ్యవసాయ రంగంలో ఉపయోగించే గడ్డి మందు వివిధ కారణాలవల్ల గడ్డి మందు తాగి మరణించిన వారి సంఖ్య మహబూబాద్ మొదటి స్థానంలో ఉందని బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీరక వసంత ఉపేందర్ రెడ్డి, కటకం యాకన్నా, రాజశేఖర్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అన్నపూర్ణ డాక్టర్ కే సుమలతతదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

## -29 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలి.
## -అఖిలపక్ష కార్మిక సంఘాలు డిమాండ్



మణుగూరు, ఫిబ్రవరి 12 (భారతశక్తి): కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపు నిచ్చారు. అందులో భాగంగా గురువారం మణుగూరు ఏరియాలోని అన్ని రంగాల కార్మిక వర్గం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మెలో పాల్గొన్నారు. మణుగూరు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, సమస్యలతో కూడిన వినతిపత్రం తహసిల్దార్ అద్దంకి నరేష్ కు అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల యొక్క శ్రమను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కంకణం కట్టుకున్నదని, దానిలో భాగంగానే ముందు తరాల కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందన్నారు. వీటిని తిప్పికొట్టవలసిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయకపోతే భవిష్యత్తులో కార్మిక వర్గం మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రద్దు చేసేంతవరకు రైతాంగ పోరాట స్ఫూర్తితో రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఆర్. మధుసూదన్ రెడ్డి, వెలగపెల్లి. జాన్, గడ్డం వెంకటేశ్వర్లు, జి శ్రీను, ఏ చంద్రం, పి భద్రం, దుగ్యాల సుధాకర్, మున్నా లక్ష్మీ కుమారి, జక్కుల రాజబాబు, నెల్లూరు నాగేశ్వరరావు, సాయి, మంగీలాల్, రాధ, మిట్టపల్లి రాజేందర్, పి సంజీవరెడ్డి, మల్లెల రామయ్య, బత్తుల లక్ష్మణ్, రాయల ప్రసాద్, రాయల బిక్షం, జంగం మోహన్ రావు, ఇమాంబి, గట్టమ్మ, యాకూబ్, చక్రపాణి, సంపత్, మంగమ్మ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా తమ సంపూర్ణ మద్దతు తెలియజేసి సమ్మెలో పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన అధ్యక్షులుగా తనుగుల శ్రీను

మణుగూరు, ఫిబ్రవరి 12 (భారతశక్తి): మండలంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్నికల్లో ప్రత్యర్థిపై తనుగుల శ్రీను 20 ఓట్ల తేడాతో గెలుపొందారు. గురువారం పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ జరిగింది. సంఘం అధ్యక్ష పదవికి ముగ్గురు కార్మిక నాయకులు పోటీకి దిగడంతో ఎన్నికలు ఉత్కంఠభరితంగా మారాయి. తనుగుల శ్రీను, బండారు మాధవబాబు, కొత్తపల్లి సీతారాములు అధ్యక్ష అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 303 మంది భవన నిర్మాణ కార్మికులు ఉండగా, 302 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బండారు మాధవబాబు కు 101 ఓట్లు, కొత్తపల్లి సీతారాములకు 76 ఓట్లు, తనుగుల శ్రీనుకు 121 ఓట్లు పోలయ్యాయి. అందులో 4 చెల్లకుండా అయ్యాయి. ఆధిక్యంగా పోలైన 20 ఓట్ల తేడాతో తనుగుల శ్రీను అధ్యక్షులుగా గెలుపొందారు. రెండు సంవత్సరాలకు ఒకసారి అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగే ప్రక్రియలో ఈ సారి ముగ్గురు పోటీలో ఉండడంతో ఉత్కంఠ భరితంగా సాగింది. గత అధ్యక్ష ఎన్నికల్లో కూడా తనుగుల శ్రీను గెలుపొందారు. రెండవసారి అధ్యక్షులుగా ఎన్నికైన తనుగుల శ్రీనుకు పట్టణ ప్రముఖులు, వ్యాపారస్తులు, రాజకీయ పార్టీల నాయకులు సోషల్ మీడియాలో, ప్రత్యక్షంగా శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు శ్రీను మాట్లాడుతూ పక్షపాతం లేకుండా కార్మిక సోదరలందరికి కార్మిక సంక్షేమం, పెన్షన్, బీమా, ఆరోగ్య సదుపాయాలు, కార్మిక హక్కుల పరిరక్షణకై కృషి చేస్తానని తెలిపారు. గతంలో చేసిన సేవలు వలనే కార్మికులు తమను మరల గెలిపించారని పేర్కొన్నారు. తమను గెలిపించేందుకు మద్దతు తెలిపిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు.

# మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

## -లేబర్ కోడ్లను,విబి జీరాంజీ బిల్లు, విత్తన చట్టం, విద్యుత్ సవరణ చట్టం ను రద్దు చేయాలి
## -కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు పెద్దపీట వేసిన మోడీ సర్కార్
## -సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 12 :

కేంద్రలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తూ, కార్మికులకు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ తీవ్రంగా విమర్శించారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్స్, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలు, జాతీయ విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లులను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.గురువారం దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన సార్వత్రిక సమ్మెలో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ నుండి సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐ ఎఫ్ టి యు,ఐ ఎన్ టి యు సి , తెలంగాణ రైతు సంఘం, అఖిల భారత రైతు కూలీ సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘంఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం ద్వారా కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించిందని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన 70 సంవత్సరాలు దాటినా కూడా కార్మికులు కనీస వేతనానికి నోచుకోకపోవడం దురదృష్టకరమన్నారు. కనీస వేతన చట్టాన్ని కఠినంగా అమలు చేసి, నెలకు రూ.26,000 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వల్ల గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల జీవనంలో మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు.కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా జాతీయ విత్తన బిల్లును తీసుకువచ్చి విత్తన రంగాన్ని బహుళజాతి కంపెనీలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. విద్యుత్ సవరణ చట్టం ద్వారా స్మార్ట్ మీటర్లు అమలు చేసి ముందస్తుగా బిల్లులు వసూలు చేయడం, ఉచిత విద్యుత్‌ను భవిష్యత్తులో నిలిపివేసే పరిస్థితులు తీసుకురావడం జరుగుతోందని విమర్శించారు. విద్యుత్ బిల్లులను పెంచి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ప్రభుత్వ రంగ సంస్థల్లో 100% విదేశీ పెట్టుబడులను అనుమతించడం, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ రంగాలను బహుళజాతి కంపెనీలకు అప్పగించడం అన్యాయమని తెలిపారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కార్మిక సంఘాలు నిరంతరం పోరాటం కొనసాగిస్తాయని స్పష్టం చేశారు.

### సార్వత్రిక సమ్మెకు పలు పార్టీలు మద్దతు

కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, ఎం సిపిఐ యు రాష్ట్ర నాయకులు వరికుప్పల వెంకన్న, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు రాంబాబు అన్నారు. ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఐ ఎన్ టి సి జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు,



ఏ ఐ టి యు సి జిల్లా నాయకులు బూర వెంకటేశ్వర్లు, టిఆర్ఎస్ కెవి రాష్ట్ర నాయకులు వై, వెంకటేశ్వర్లు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ నాయకులు ప్రభాకర్, పింఛనర్ల సంఘం జిల్లా కార్యదర్శి మన్నె యాదగిరి, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భాస్కరమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వల్లపు దాసు సాయికుమార్, మేకన బోయిన శేఖర్, వేల్పుల వెంకన్న, వీరబోయిన రవి, జె నరసింహారావు, జంపాల స్వరాజ్యం, మేకన బోయిన సైదమ్మ, యాతాకుల వెంకన్న, ఎం సి పి ఐ యు జిల్లా కార్యదర్శి షేక్ నజీర్,ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు,జిల్లా నాయకులు సామ నర్సిరెడ్డి,గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు గంగరాజు, కలకోట్ల మల్సూర్,మాతంగి నాగయ్య,నాగమ్మ,వెంకటేష్ ,హమాలీ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామకృష్ణ, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి,ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్ తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రికి విద్యాపీఠంలో 14 అడుగుల జలలింగం

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 12:

సంగారెడ్డి మండలం ఫసల్వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఈ నెల 15వ తేదీన 14 అడుగుల జల లింగాన్ని ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. ఆశ్రమంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15వ తేదీన ఉదయం ఆరు గంటల నుంచి 16వ తేదీ ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు ఆశ్రమానికి వచ్చిన ప్రతిభక్తుడు జల లింగానికి అభిషేకం చేసే అవకాశాన్ని కల్పించినట్లు చెప్పారు. ఈనెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఏడు రోజుల పాటు భక్తులు జల లింగాన్ని దర్శించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో 48 వేల కిలోమీటర్లు తిరిగి 1008 నదుల నుంచి నీటిని సేకరించినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని



జల లింగాన్ని దర్శించుకోవాలని చెప్పారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి కి ఒక్కోరకమైన శివలింగాన్ని తయారు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంత కిషన్ పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్- తేజస్ నంద లాల్ పవర్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 12 :

నేడు నిర్వహించనున్న పురపాలక ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలని అందుకు తగిన ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సముదాయ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన ఓట్లు లెక్కింపు ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్ వైజర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఓట్లు లెక్కింపు కేంద్రంలో అనుసరించాల్సిన నియమావళి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, టేబుల్‌వైజ్ కౌంటింగ్ విధానం, బ్యాలెట్ పేపర్లు వేరు చేయుట, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విధానం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ ప్రతి రౌండ్ లెక్కింపు పూర్తయ్యే సరికి ఫలితాలను సమగ్రంగా నమోదు చేసి, సంబంధిత అభ్యర్థుల ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని, తదుపరి పరిశీలకుల అనుమతితో విజేతలను ప్రకటించాలని అధికారులకు సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. లెక్కింపు కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు తెలిపారు.గుర్తింపు కార్డు కలిగిన వ్యక్తులకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు.సిబ్బంది ఉదయం 7 గంటల వరకు లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలని




సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, అనుమతి పొందిన వ్యక్తులకే ప్రవేశం కల్పించబడుతుందని స్పష్టం చేశారు.లెక్కింపు సిబ్బంది సమయానికి కేంద్రాలకు హాజరై తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.జనరల్ అబ్జర్వర్ పాండా దాస్ మాట్లాడుతూ కౌంటింగ్ ను చాలా పకడ్బందీగా నిర్వహించాలని, వ్యాలిడిటీ, ఇన్ వ్యాలిడిటీ ఓట్ల గురించి ఆర్వోలకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఒకసారి ఒక ఓటును రైట్, రాంగ్ గా నిర్ధారించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అట్టి నిర్ణయాన్ని మార్చుకోకూడదని, కౌంటింగ్ సిబ్బంది అందరూ సకాలంలో హాజరుకావాలని అన్నారు.ఈ శిక్షణ సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, సూర్యాపేట,కోదాడ, హుజూర్నగర్ ఆర్డీవోలు వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు మున్సిపల్ కమిషనర్లు,తాసిల్దారులు,రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# భైంసా ప్రజలు మజ్లిస్‌పై విశ్వాసం వ్యక్తం చేశారు: జబీర్ అహ్మద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 12: (భారత శక్తి) నిర్మల్ జిల్లా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) అధ్యక్షుడు, భైంసా మాజీ మున్సిపల్ చైర్మన్ జబీర్ అహ్మద్ మినీ దారుస్సలాం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన భైంసా మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో పట్టణ ప్రజలు మజ్లిస్‌కు అనుకూలంగా అధిక సంఖ్యలో ఓటు వేసి పోలింగ్ శాతాన్ని పెంచినందుకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం మజ్లిస్ ఐదోసారి భైంసా మున్సిపాలిటీలో అధికారాన్ని నిలబెట్టుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మజ్లిస్ పాలనలో పట్టణంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ప్రజల మద్దతుకు ప్రధాన కారణమని పేర్కొన్నారు.

మజ్లిస్ హయాంలో తాగునీటి సదుపాయాల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు, పేదలు మరియు విధవలకు పింఛన్ల మంజూరు, డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం, అర్హులైన పేదలకు రేషన్ కార్డుల జారీ వంటి పలు కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనులను గుర్తించిన ప్రజలు మజ్లిస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిస్తారని



ఆశాభావం వ్యక్తం చేశారు.ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించిన జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల, ఏఎస్పీ రాజేష్ మీనా సహా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులకు మరియు పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సమావేశంలో మజ్లిస్ ఎన్నికల అభ్యర్థులు, టౌన్ అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, ఉపాధ్యక్షుడు మహ్మద్ ఆమిర్ అహ్మద్, జనరల్ సెక్రటరీ ఎం.డి. మాజిద్ తదితరులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి సీఎంకప్ క్రీడల్లో జిల్లా పరిషత్ హైస్కూల్ బేలా విద్యార్థిని ప్రతిభ



ఆదిలాబాద్ జిల్లా, ఫిబ్రవరి 12 (భారత శక్తి):-జిల్లాస్థాయి సీఎంకప్ క్రీడా పోటీలలో జిల్లా పరిషత్ హైస్కూల్ బేలా పాఠశాలకు చెందిన విద్యార్థిని జి. శృతి విశేష ప్రతిభను కనబరిచింది. లాంగ్ జంప్ విభాగంలో మొదటి బహుమతిని, రన్నింగ్ పోటీలో రెండవ బహుమతిని సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.విద్యార్థిని సాధించిన ఈ విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్ము కృష్ణ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీమతి వందనతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. శృతిని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# సినిమా

## లేటు వయసులో పెళ్లి చేసుకోవడంపై నటుడు సుబ్బరాజు స్పందన



క్యారెక్టర్ ఆర్టిస్టుగా టాలీవుడ్ లో నటుడు సుబ్బరాజు తనదైన ముద్ర వేశారు. 'బాహుబలి 2' ద్వారా దేశ వ్యాప్తంగా కూడా ఆయన గుర్తింపు తెచ్చుకున్నారు. నటుడిగా బిజీగా ఉన్న సుబ్బరాజు... చాలా లేటుగా పెళ్లి చేసుకున్నారు. గత ఏడాది నవంబరులో సడెన్ గా పెళ్లి చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... పెళ్లిళ్లు లేటుగా ఎందుకు చేసుకుంటున్నారు? విడాకులు ఎందుకు పెరుగుతున్నాయి? అనే విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చాలామంది ఇంట్లో వాళ్ల ఒత్తిడితోనో, లేదా వయసు పెరిగిపోతోందనో పెళ్లి చేసుకుంటారని సుబ్బరాజు అన్నారు. ఇది కరెక్ట్ కాదని చెప్పారు. నీకు ఏదో వస్తుందని చేసుకునేది పెళ్లి కాదు... నీ భాగస్వామికి నీవు ఏమి ఇవ్వగలవనే దానిపై నీ పెళ్లి ఆధారపడి ఉండాలని అన్నారు. భాగస్వామిపై పెట్టుకునే భారీ అంచనాలే పెళ్లిళ్లు పెటాకులు కావడానికి కారణమని చెప్పారు. తన భార్య అలా ఉండాలని, తన భర్త అలా ఉండాలని ఊహించుకుంటారని, పెళ్లయిన తర్వాత వాస్తవం అలా లేకపోతే మనస్పర్థలు మొదలవుతాయని అన్నారు. తన భార్యకు తన సర్వస్వం ఇవ్వగలను అని నమ్మకం వచ్చిన తర్వాతే తాను పెళ్లి చేసుకున్నానని చెప్పారు.

## 'ఉస్తాద్ భగత్ సింగ్' అప్డేట్స్ పై హరీశ్ శంకర్ కీలక వ్యాఖ్యలు



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ - క్రేజీ డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబో అంటే టాలీవుడ్‌లో అత్యంత ఎక్స్‌పెక్టేషన్ కలిగిన కాంబినేషన్లలో ఒకటి. 'గబ్బర్ సింగ్'తో ఈ కాంబో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఇప్పుడు 'ఉస్తాద్ భగత్ సింగ్'తో మళ్లీ ప్రభంజనం సృష్టించేందుకు వీరు రెడీ అవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌కు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. మార్చి 26న ఈ సినిమా విడుదల కాబోతోంది. మరోవైపు, చాలా కాలంగా సినిమా గురించి అప్డేట్ రావడం లేదన్న నిరాశతో ఉన్న పవన్ అభిమానులు సోషల్ మీడియాలో హరీశ్ శంకర్‌ను ట్యాగ్ చేసి ప్రశ్నలు గుప్పిస్తున్నారు. వందల సంఖ్యలో వస్తున్న పోస్టులపై హరీశ్ శంకర్ తాజాగా స్పందించారు. అభిమానుల ఆత్రుతను తాను పూర్తిగా అర్థం చేసుకుంటున్నానని, కానీ ప్రతి అప్డేట్ కు సరైన సమయం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. "మమ్మల్ని నమ్మండి... సెలబ్రేషన్స్ లోడింగ్... త్వరలోనే అన్ని అప్‌డేట్స్ ఇస్తాం. సినిమా నిర్మాణం వెనుక ఎంతో కష్టం ఉంటుంది. దయచేసి అర్థం చేసుకోండి. మేము ఇచ్చే ప్రతి అప్‌డేట్‌ను మీరు ఘనంగా సెలబ్రేట్ చేసుకుంటారు" అని పోస్ట్ చేశారు.

## రవి నా జీవితంలోకి వచ్చిన తర్వాత నా ప్రపంచమే మారిపోయింది: కెనిషా




ప్రముఖ కోలీవుడ్ నటుడు జయం రవి, గాయని కెనిషా రిలేషన్ లో ఉన్నారనే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. పలు సందర్భాల్లో వీరిద్దరూ అత్యంత సన్నిహితంగా కనిపించారు. తాజాగా, కెనిషా ఈ నెల 7న తన పుట్టినరోజు వేడుకలను రవితో కలిసి జరుపుకుంది. ఆ సందర్భంగా దిగిన ఫొటోలను తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసింది. అంతేకాదు, జయం రవి గురించి భావోద్వేగంతో కూడిన పోస్ట్ పెట్టింది. తనను చిన్నప్పటి నుంచి ఎవరూ ఒక మనిషిగా గుర్తించలేదని కెనిషా ఆవేదన వ్యక్తం చేసింది. ప్రతి ఒక్కరూ తనను దూరం పెడుతున్నారనే భావన తనలో ఉండేదని చెప్పింది. వారి నుంచి తాను కేవలం కొంత ప్రేమ, గౌరవ మర్యాదలు మాత్రమే కోరుకున్నానని తెలిపింది. జయం రవి తన జీవితంలోకి వచ్చిన తర్వాత తన ప్రపంచమే మారిపోయిందని పేర్కొంది. ఇప్పుడు ఆలోచనలు, వ్యవహారశైలి, ప్రేమ వంటి విషయాల్లో తన ఆలోచనా విధానం కొత్తగా ఉందని తెలిపింది.

## అందుకే కావచ్చు




విశ్వక్ సేన్ హీరోగా కేవీ అనుదీప్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా ఫంకీ. ఇందులో కయాదు లోహర్ హీరోయిన్ గా నటించింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 13న రిలీజ్ కాబోతున్న ఈ సినిమాపై సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ప్రమోషన్స్ లో భాగంగా మేకర్స్ తాజాగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఆ ఈవెంట్ లో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ.. గతేడాది ఫిబ్రవరిలో నిరుత్సాహం లో ఉన్నానని, ఇప్పుడు హ్యాపీగా ఉన్నానని, అన్ని రోజులూ ఒకేలా ఉండవని చెప్పాడు. ప్రతి సినిమా రిలీజ్‌కు ముందు తనకు కొంచెం టెన్షన్ ఉంటుందట. కానీ ఈసారి మాత్రం చాలా రిలాక్స్ గా ఉన్నట్లు తెలిపాడు. బహుశా 30 ఏళ్ల వయసు వచ్చినందుకే అనుకుంటానన్నాడు. ఈ సినిమా చూసి డెఫినిట్ గా ఎంజాయ్ చేస్తారని పేర్కొన్నాడు. థియేటర్ కు వచ్చిన ప్రతి ఒక్కరిని ఈ సినిమా విపరీతంగా నవ్విస్తుందన్నాడు.

## భయపడ్డ



లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం సతీ లీలావతి. తాతినేని సత్య దర్శకత్వం వహించిన ఈ సినిమాను ఆనంది ఆర్ట్స్ నిర్మాణ సంస్థ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్ పై నాగమోహన్, రాజేశ్.టి నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమా మార్చి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహించిన ప్రమోషన్స్ లో పాల్గొన్న త్రిపాఠి.. ప్రస్తుతం బాబుతో కుదరడం లేదు కాబట్టి ప్రాజెక్ట్స్ కొంచెం ఆలస్యం అవుతున్నట్లు చెప్పింది. ఇక ఈ మూవీ మొదటి రోజు డైరెక్టర్ యాక్షన్ సన్నివేశం ప్లాన్ చేయడంతో భయమైందట. దీంతో దర్శకుడి వద్దకు వెళ్లి తాను ప్రెగ్నంట్ అని చెప్పిందట. అప్పటి వరకు ఎవరికీ తెలియదట. ఆ తర్వాత కూడా ఎవరికీ చెప్పలేదట. ప్రెగ్నెన్సీ తోనే మూవీ మొత్తం పూర్తి చేసినట్లు వివరించింది.

## ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ –2026 నామినేషన్స్ లిస్ట్ రిలీజ్




దక్షిణాది చిత్రసీమలకు సంబంధించిన ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ 2026 ప్రకటన వచ్చేసింది. ఫిబ్రవరి 21న 70వ ఫిల్మ్ ఫేర్ అవార్డుల వేడుకలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది అవార్డుల కోసం పోటీపడుతున్న తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ చిత్రాల జాబితా విడుదలైంది. 2024లో విడుదలైన సినిమాల్లో ఎంపికైన వాటికి అవార్డులు అందించనున్నారు. టాలీవుడ్ నుంచి ఉత్తమ చిత్రం కోసం 35 చిన్న కథ కాదు, కమిటీ కుర్రోళ్లు, హనుమాన్, కల్కి 2898 ఏడీ, లక్కీ భాస్కర్, పుష్ప: ది రూల్ పోటీ పడుతున్నాయి. ఉత్తమ దర్శకుడు విభాగంలో నాగ్ అశ్విన్(కల్కి 2898 ఏడీ), నంద కిశోర్(35 చిన్న కథ కాదు), ప్రశాంత్ వర్మ(హనుమాన్), సుకుమార్(పుష్ప ది రూల్), వెంకీ అట్లూరి(లక్కీ భాస్కర్), యదు వంశీ(కమిటీ కుర్రోళ్లు) పేర్లను ఎంపిక చేశారు. వీటితో పాటు ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ సహాయ నటి, ఉత్తమ సంగీత దర్శకుడు, ఉత్తమ సాహిత్యం, బెస్ట్ సింగర్, బెస్ట్ సింగర్(ఫిమేల్) అవార్డులకు జాబితా ప్రకటించారు.

## అడివి శేష్ దర్శకత్వంలో అకీరా నందన్ గ్రాండ్ ఎంట్రీ?

ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తనయుడు అకీరా నందన్ సినీ అరంగేట్రంపై మళ్లీ చర్చ జోరందుకుంది. అకీరా ఎంట్రీ ఎప్పుడు? ఎవరి దర్శకత్వంలో? అనే ప్రశ్నలు గత కొంత కాలంగా ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పుడు ఈ చర్చలో టాలెంటెడ్ హీరో/డైరెక్టర్ అడివి శేష్ పేరు వినిపించడం ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇంతకుముందు అకీరాను శేఖర్ కమ్ముల పరిచయం చేయబోతున్నారనే వార్తలు వినిపించాయి. కానీ తాజాగా అడివి శేష్ అకీరా డెబ్యూ బాధ్యతలు తీసుకుంటారన్న ప్రచారం ఊపందుకుంది. అకీరాతో శేష్‌కు ఉన్న సాన్నిహిత్యం ఈ వార్తలకు బలం





ఇస్తోంది. ముఖ్యంగా 'రైటర్స్ బ్లాక్' షార్ట్ ఫిల్మ్‌కు అకీరా సంగీతం అందించినప్పుడు శేష్ మద్దతుగా నిలిచారు. ఆ అనుబంధం ఇప్పటికీ కొనసాగుతోంది. 'క్షణం', 'గూఢచారి', 'మేజర్' వంటి చిత్రాలతో తనదైన ముద్ర వేసిన అడివి శేష్... అకీరా కోసం ప్రత్యేకమైన, వైవిధ్యమైన కథ సిద్ధం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. వారసుడి డెబ్యూ కాబట్టి సాధారణ కమర్షియల్ ఎంట్రీ కాకుండా, కంటెంట్ బేస్డ్ మూవీతో లాంచ్ చేయాలని పవన్ కల్యాణ్ కూడా భావిస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌లో శేష్ దర్శకత్వం వహిస్తారా? లేక కేవలం కథ అందిస్తారా? అనే దానిపై క్లారిటీ రావాల్సి ఉంది.

# సిటీకి 'త్రిశూలం'.. పాలనలో నయా విప్లవం..!

* **మూడు కార్పొరేషన్లుగా గ్రేటర్ విభజన: స్టాండింగ్ కమిటీ గ్రీన్ సిగ్నల్**
* **'సైబరాబాద్, మల్కాజిగిరి'కి చెరో రూ. 500 కోట్ల బడ్జెట్**
* **ప్రజలే కేంద్ర బిందువుగా 'ట్రై కార్పొరేషన్' పాలన: జయేష్ రంజన్**





హైదరాబాద్, ఫిబ్రవరి 12 (భారత శక్తి): భాగ్యనగర పాలనలో సరికొత్త అధ్యాయం మొదలైంది. జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా నగరాన్ని మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజిస్తూ తీసుకున్న నిర్ణయానికి తొలి స్టాండింగ్ కమిటీ ఆమోద ముద్ర వేసింది. "ప్రజల ముంగిటకే పాలన.. సమస్యల తక్షణ పరిష్కారం" అనే నినాదంతో ప్రభుత్వం చేపట్టిన ఈ 'ట్రై కార్పొరేషన్' వ్యవస్థ ద్వారా నగర రూపురేఖలు మార్చాలని అధికారులకు రాష్ట్ర పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్ఎంసీ ప్రత్యేక అధికారి జయేష్ రంజన్ దిశానిర్దేశం చేశారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కీలక భేటీలో నగర భవిష్యత్తుపై స్పష్టమైన ప్రణాళికను ఆవిష్కరించారు.

*** పాలనా వికేంద్రీకరణ.. నిధుల వరద**

కోర్ అర్బన్ రీజియన్ (CURE) పునర్వ్యవస్థీకరణలో భాగంగా జీహెచ్ఎంసీని మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించారు:

గ్రేటర్ హైదరాబాద్: శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు దీని పరిధిలో ఉంటాయి.

*** సైబరాబాద్ & మల్కాజిగిరి:**

ఈ రెండు కొత్త కార్పొరేషన్లకు స్వతంత్ర హోదా, చట్టబద్ధమైన అధికారాలను కల్పించారు.

బడ్జెట్ అండ: కొత్తగా ఏర్పడిన సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు తమ కార్యకలాపాలు వేగంగా ప్రారంభించేందుకు తక్షణమే రూ. 500 కోట్ల చొప్పున నిధులను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

*** పది రోజుల్లో ఆస్తుల పంపిణీ**

విభజన కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో సజావుగా సాగేందుకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (CGG) నేతృత్వంలో ఒక 'టాస్క్ ఫోర్స్' రంగంలోకి దిగింది. రానున్న 10 రోజుల్లోనే ఆస్తులు, అప్పులు, ఒప్పందాలు మరియు సిబ్బంది కేటాయింపులను ఈ టాస్క్ ఫోర్స్ శాస్త్రీయ పద్ధతిలో పూర్తి చేయనుంది.

*** ఆరు నెలల యాక్షన్ ప్లాన్:**

"నగరంలో మార్పు కంటికి కనిపించాలి (Visible Impact). ఐటీ వంటి రంగాల్లో ఫలితాలకు సమయం పట్టవచ్చు కానీ, మున్సిపల్ సేవల్లో పని చేస్తే ఫలితం వెంటనే వస్తుంది" అని జయేష్ రంజన్ స్పష్టం చేశారు.

మౌలిక వసతులు: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఎస్ఆర్డీపీ, ఎస్ఎన్డీపీ పనులను వేగవంతం చేయాలి. నాలాల పూడికతీత పనులను తక్షణం మొదలుపెట్టాలి.


పారిశుద్ధ్య పోటీలు: కార్పొరేషన్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంపొందించేందుకు 'పారిశుద్ధ్య అవార్డులు' ప్రకటించారు. చెత్త రహిత వార్డులుగా తీర్చిదిద్దిన అధికారులకు, కార్పొరేటర్లకు, ఎన్జీవోలకు నగదు ప్రోత్సాహకాలు అందించనున్నారు.

*** కర్ణన్ మార్క్ పాలన..**

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పనితీరును ప్రత్యేక అధికారి కొనియాడారు. క్లిష్టమైన పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను తనదైన నేర్పుతో సులభతరం చేశారని, గతంలో ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌గా, కలెక్టర్‌గా ఆయన చూపిన చొరవ జీహెచ్ఎంసీ అభివృద్ధికి ఊతమిస్తుందని పేర్కొన్నారు. ప్రజలే కేంద్ర బిందువుగా, ఫిర్యాదుల పరిష్కారమే ఇతివృత్తంగా ప్రతి అధికారి అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఇంట్రస్టెడ్ కోర్సుతో ఇంటర్.. ఎదిగే భవిష్యత్తుకు ఎంట్రన్స్

**విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్, కామర్స్, సైన్స్ విభాగాల్లో సబ్జెక్టులను ఎంచుకుంటారు. దేశంలో సుమారు 14 శాతం మంది విద్యార్థులు కామర్స్‌ను హయ్యర్ సెకండరీ తరగతుల్లో ఎంచుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా సైన్స్ స్ట్రీమ్ పై మక్కువ చూపుతున్నారు. కర్ణాటక విద్యార్థులు ఎక్కువగా కామర్స్‌పై ఆసక్తి చూపుతున్నారు. అండర్ గ్రాడ్యుయేట్‌లో ఏ కోర్సులో చేరాలనుకుంటున్నారో, దాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోవాలి. ఎందుకంటే అండర్ గ్రాడ్యుయేట్ లెవల్‌లో చేరే కోర్సుల్లో మొదట ఆర్ట్స్, సైన్స్, కామర్స్, ఆ తర్వాత ఇంజినీరింగ్ ఉంది. ఇది వారు చదవాలనుకునే కోర్సులను బట్టి లేదా వారికున్న అవకాశాలు, వసతులను బట్టి ఉంటుంది.**



### ఇంటర్‌లో ఏ సబ్జెక్టు తీసుకోవాలి

- మన ఇంట్రెస్ట్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అయితే, దానికి తగ్గ సామర్థ్యం ఉందనుకుంటే కామర్స్ కోర్సులో చేరి, ఆ తర్వాత బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, బిజినెస్ మేనేజ్‌మెంట్ స్టడీస్ వంటి కోర్సుల్లో చేరవచ్చు. చాలావరకు బిజినెస్ కోర్సుల్లో ఏ స్ట్రీమ్ వారైనా చేరవచ్చు. కానీ బిజినెస్ ఎడ్యుకేషన్‌లో అకౌంట్స్, కామర్స్, మ్యాథమెటిక్స్ వంటి వాటిపై పట్టు ఉంటే మంచిది. కొన్ని అడ్మిషన్లలో మ్యాథమెటిక్స్ అవసరం ఉంటుంది. కాబట్టి ముందు నుంచే వాటిపై అవగాహన పెంచుకోవచ్చు.

### ఏ స్కిల్స్ అవసరం

- ప్రతి రంగంలో బిజినెస్ మేనేజర్ల అవసరం ఉంది. ఎన్నో ఇండస్ట్రీస్‌లో అనేక అవకాశాలున్నాయి. ప్రతి ప్రొఫెషన్‌లో బిజినెస్ స్కిల్స్ అవసరం. ఎకనామిక్స్, డేటా అనాలిసిస్ పట్ల అవగాహన ఉంటే ముఖ్యమైన బిజినెస్ నిర్ణయాలు తీసుకోవచ్చు. అలాగే ఫైనాన్షియల్ అకౌంటింగ్ కూడా అవసరమే. ఇవి సబ్జెక్ట్స్‌లో నేర్చుకోవచ్చు. నాయకత్వ, కమ్యూనికేషన్, ఇతరులతో సంప్రదింపులు చేయగల నైపుణ్యాలు, నెట్‌వర్కింగ్ అవసరం. పెరిగిన ఐఐఎంల సంఖ్య బిజినెస్ మేనేజ్‌మెంట్ రంగం పట్ల పెరుగుతున్న ఆసక్తిని తెలియజేస్తుంది.

### మేనేజ్‌మెంట్ కోర్సులు

- సాధారణంగా గ్రాడ్యుయేషన్ తర్వాత ఎంబీఏ చేసేవారు. అండర్ గ్రాడ్యుయేట్ లెవల్‌లో బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, బ్యాచిలర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులు ఉన్నాయి. అలాగే గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చేయవచ్చు. ఇంటర్ పూర్తయిన తర్వాత ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ 5 సంవత్సరాల కోర్సులు ఉన్నాయి. బీబీఏ ప్రోగ్రాం మూడు సంవత్సరాల కోర్స్. కానీ కొత్త ఎడ్యుకేషన్ పాలసీ వచ్చిన తర్వాత బీబీఏ (ఆనర్స్) అని నాలుగు సంవత్సరాల కోర్సును కొన్ని కళాశాలలు నిర్వహిస్తున్నాయి.

### ఉపాధి అవకాశాలు

- ఇండస్ట్రియల్ రెవల్యూషన్ మొదలైనప్పటి నుంచి మేనేజర్ల అవసరం పెరిగింది. ఒక కంపెనీ ముందుకెళ్లాలంటే ప్రతి డిపార్ట్‌మెంట్‌లో సరైన స్కిల్స్ ఉన్న మేనేజర్ల అవసరం ఎంతో ఉంది. మేనేజ్‌మెంట్ కోర్స్ చేసిన వారికి ఎన్నో అవకాశాలున్నాయి. వారి స్కిల్స్, నాలెడ్జ్, ఎబిలిటీని బట్టి తగిన రంగంలో ఉద్యోగంలో చేరవచ్చు.

### హ్యూమన్ రిసోర్సెస్/ మానవ వనరులు

- ప్రతి సంస్థకు పనిచేసే ఉద్యోగులు కావాలి. సంస్థకు సరైన వ్యక్తులను ఎంచుకోవడంలో హెచ్ఆర్ పాత్ర చాలా ముఖ్యమైనది. పీపుల్ స్కిల్స్ ఉన్నవారు ఈ పదవిలో రాణించగలరు. రిక్రూట్‌మెంట్, హైరింగ్, ప్లానింగ్, కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్, ప్రాబ్లమ్ సాల్వింగ్, అడ్వైజింగ్‌లో స్కిల్స్ ఉండాలి.

### మార్కెటింగ్ లేదా సేల్స్

- కంపెనీ విలువలను, ప్రొడక్టులను సరిగ్గా రిప్రజెంట్ చేస్తూ, క్లయింట్లను దృష్టిలో పెట్టుకోవడం వీరి బాధ్యత. మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం. మార్కెట్ విశ్లేషణ, పరిశోధన లేదా మార్కెటింగ్ ప్రణాళిక వేయడం, మార్కెట్లో అస్థిరతను, క్లయింట్ లేదా కొనుగోలుదారుల అవసరాన్ని అర్థం చేసుకోగలగడం ఈ ఉద్యోగానికి అవసరం. తమ ప్రొఫెషన్‌కి సంబంధించిన టెక్నికల్ స్కిల్స్ టూల్స్‌ని ఉపయోగించగలగాలి.

### అడ్వర్టైజింగ్ అండ్ పీఆర్

- ప్రతి వ్యాపారానికి ప్రకటనలు, పీఆర్ నిర్వహణ అవసరం ఉంటుంది. మార్కెటింగ్ టీమ్స్‌తో కలిసి పని చేయాలి, వారికి అనుగుణంగా అడ్వర్టైజింగ్ క్యాంపెయిన్ రచించాలి. వారి ఆలోచనలను సరిగ్గా చెప్పగలగాలి. ప్లానింగ్, ఆర్గనైజింగ్, కో ఆర్డినేషన్ అవసరం. కస్టమర్ రిలేషన్ మేనేజర్లు, పబ్లిక్ రిలేషన్స్ సిబ్బంది, పీఆర్ రచయితలు, కాపీ రైటర్లుగా ఉద్యోగాలు పొందవచ్చు.

### ఆర్థిక విశ్లేషకుడు

- ఒక సంస్థకు కొత్త అవకాశాలను గుర్తించడానికి, వ్యాపార నిర్ణయాలు తీసుకోవడానికి క్లిష్టమైన విశ్లేషణ నైపుణ్యాలను ఉపయోగించి యాజమాన్యానికి సలహాలు ఇస్తాడు. ఫైనాన్షియల్ అనలిస్ట్ కావడానికి, సాధారణ బీబీఏ డిగ్రీ లేదా ఫైనాన్స్ స్పెషలైజేషన్‌తో ఉన్న బీబీఏ డిగ్రీని ఎంచుకోవచ్చు. గణితం లేదా ఫైనాన్స్ సంబంధిత డిగ్రీ, ఎంబీఏ కూడా సహాయపడుతుంది.

### ఆపరేషన్స్/ లాజిస్టిక్స్ నిర్వహణ

- మంచి ఫలితాల కోసం వ్యాపార కార్యకలాపాలను సమన్వయం చేయడం వీరి పని. ఆపరేషన్స్ మేనేజర్, బిజినెస్ కన్సల్టెంట్, బిజినెస్ అనలిస్ట్ వంటి అవకాశాలున్నాయి.

### ఇతర రంగాలు

- బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్, ఎయిర్ ట్రావెల్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఫైనాన్స్, ఫారిన్ ట్రేడ్ మార్కెటింగ్, అకౌంటింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, రిటైల్ మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ వంటి విభిన్న రంగాల్లో ఉద్యోగావకాశాలున్నాయి.

### ఇతర అవకాశాలు

- సొంత వ్యాపారం లేదా కుటుంబ వ్యాపారం నిర్వహించవచ్చు. విద్యారంగంలో బాధ్యతలు నిర్వహించవచ్చు. హయ్యర్ ఎడ్యుకేషన్ చేయవచ్చు. సివిల్ సర్వీసెస్ వైపు ప్రయత్నించవచ్చు.

### ఎంట్రన్స్ పరీక్షకు ఎలా చదవాలి?

- వెర్బల్ ఎబిలిటీ విభాగంలో వొకాబులరీ, గ్రామర్, ప్యాసేజ్ బేస్డ్ జంబుల్డ్ సెంటెన్స్, పేరా కంప్లీషన్ వంటి ప్రశ్నలు ఉంటాయి.
- పదాల అర్థాలను నేర్చుకోవడంతో పాటు వాటిని ఉపయోగించడం నేర్చుకోవాలి. గ్రామర్ రూల్స్‌పై పట్టు ఉండాలి. మాట్లాడే మాటల్లో, రాసే రాతల్లో ఉపయోగించే పదాలపై, గ్రామర్‌పై దృష్టి పెట్టాలి. పుస్తక పఠనం అలవర్చుకోవడం వల్ల పేరాగ్రాఫ్ బేస్డ్ ప్రశ్నలు బాగా చేయగలరు. అంతేకాదు చదివిన మంచి పుస్తకం గురించి చెప్పమని ఇంటర్వ్యూలో అడగవచ్చు.
- క్వాంటిటేటివ్ సెక్షన్‌లో బాగా సాధన చేయాలి. ప్రశ్నలను చదవడం, సాల్వ్ చేయడం అలవర్చుకోవాలి. స్పీడ్‌గా, కరెక్ట్‌గా లెక్కలు చేయగలగాలి. కాన్సెప్ట్, క్లారిటీ అవసరం.
- లాజికల్ రీజనింగ్ సెక్షన్‌లో రాణించాలంటే క్రిటికల్ థింకింగ్‌ని అలవర్చుకోవాలి. అనలిటికల్ రీజనింగ్ ప్రశ్నలు, పజిల్స్ చేయాలి.
- రైటింగ్ స్కిల్స్ మెరుగుపరుచుకోవాలి. కరెంట్ అఫైర్స్ పట్ల అవగాహన ఉంటే కొన్ని పరీక్షలకు ఉపయోగపడుతుంది. అలాగే ఇంటర్వ్యూలో ఏదైనా విషయంపై అభిప్రాయం అడిగితే జవాబు చెప్పవచ్చు.
- ఈ పరీక్షల ఎలిజిబిలిటీ క్రైటీరియాలో ఇంటర్ పూర్తిచేయడం, ఉత్తీర్ణత శాతం గురించిన విషయాలున్నాయి. దేశంలోని కొన్ని కళాశాలలకు మాత్రమే మ్యాథమెటిక్స్/ స్టాటిస్టిక్స్/ కామర్స్ అవసరం ఉండవచ్చు. ఎప్పుడైనా సరే ఎలిజిబిలిటీ చూసుకొనే పరీక్షకు అప్లై చేయడం మంచిది. కానీ ఇక్కడ గమనించాల్సింది ఏంటంటే బీబీఏ చదివేటప్పుడు మ్యాథమెటిక్స్, కామర్స్ నాలెడ్జ్ అవసరం. కాబట్టి ఇంటర్‌లో ఆయా సబ్జెక్ట్స్ తీసుకుంటే ఎక్కువ ఉపయోగపడే అవకాశం ఉంది.



### టాప్ కాలేజీలు

**ఐఐఎం ఇండోర్**

- మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ అంటే ఐఐఎం లే గుర్తుకు వస్తాయి. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ ఐదు సంవత్సరాల కోర్సును మొదలుపెట్టిన మొదటి ఐఐఎం ఇది. వెర్బల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఎబిలిటీని రాత పరీక్ష ద్వారా టెస్ట్ చేస్తారు. ఆ తర్వాత ఇంటర్వ్యూ.
- ఐపీఎం ప్రోగ్రాం, పీజీపీ ప్రోగ్రాం ప్లేస్‌మెంట్ రిపోర్ట్ ప్రకారం 2021–23 బ్యాచ్ హయ్యెస్ట్ ప్యాకేజీ రూ.1.4 కోట్లు. యావరేజ్ ప్యాకేజీ రూ.30 లక్షలు. కన్సల్టింగ్, ఫైనాన్స్, ఏహెచ్ఆర్ అండ్ జనరల్ మేనేజ్‌మెంట్, ఐటీ అనలిటిక్స్, సేల్స్ మార్కెటింగ్ రంగాల్లో విద్యార్థుల జాబ్ సెలక్షన్స్ జరిగాయి.

### ఐఐఎం రాంచీ

- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ కోర్స్ సెలక్షన్స్ కోసం, ఇండోర్ నిర్వహించే ఐపీఎం పరీక్ష స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. ఆ తర్వాత ఇంటర్వ్యూ ఉంటుంది.
- మూడు సంవత్సరాలు చదివిన తర్వాత బ్యాచిలర్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిగ్రీ ఇస్తారు.
- మూడు సంవత్సరాల తర్వాత ఎగ్జిట్ ఆప్షన్ ఉంది.
- ఐఐఎం రాంచీ ఐపీఎం ప్రోగ్రాంను 2022లో ప్రారంభించింది. కాకపోతే ఎంబీఏ ప్లేస్‌మెంట్ రిపోర్ట్ ప్రకారం 2021–23 బ్యాచ్ హయ్యెస్ట్ ప్యాకేజీ (ఇంటర్నేషనల్) రూ.67 లక్షలు, డొమెస్టిక్ రూ.37 లక్షలు. యావరేజ్ ప్యాకేజీ రూ.17 లక్షలు.

### ఐఐఎం రోహతక్

- ఐఐఎం రోహతక్ 2019లో ఐపీఎం ప్రోగ్రాంను ప్రారంభించింది. ఐదు సంవత్సరాల ఈ ప్రోగ్రాం బీబీఏ + ఎంబీఏ ప్రోగ్రాం. మూడు సంవత్సరాల తర్వాత ఎగ్జిట్ ఆప్షన్ ఉంది.
- ప్లేస్‌మెంట్ రిపోర్ట్ ప్రకారం 2021–23 బ్యాచ్ హయ్యెస్ట్ ప్యాకేజీ రూ.36 లక్షలు (డొమెస్టిక్). యావరేజ్ ప్యాకేజీ రూ.18 లక్షలు.
- అడ్మిషన్ కోసం రోహతక్ నిర్వహించే IPMAT పరీక్ష రాయాలి. అందులో క్వాలిఫై అయిన తర్వాత ఇంటర్వ్యూకి పిలుస్తారు. అకడమిక్స్, ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఫైనల్ సెలక్షన్ ఉంటుంది. పరీక్షలో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్‌ని పరీక్షిస్తారు.



# కార్పొరేట్లకు కాదు.. కార్మికులకు న్యాయం చేయండి

* ఆవాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి జబ్బార్
* ప్రజలను కాపాడండి_దేశాన్ని రక్షించండి
* రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్
* కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి
* గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్య నాయక్




వనపర్తి జిల్లా, హైదరాబాద్, ఫిబ్రవరి 12 (భారత శక్తి): పాన్గల్ మండల కేంద్రంలో గురువారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అంబేద్కర్ చౌరస్తా లో సిఐటియు మండల కన్వీనర్ సూర్యవంశం రాము అధ్యక్షతన సమ్మె సమావేశం నిర్వహించారు, అనంతరం బస్టాండ్ చౌరస్తా దగ్గరికి ర్యాలీగా వెళ్లి నిరసన తెలియజేశారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆవాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి జబ్బార్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్య నాయక్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, సిఐటియు సీనియర్ నాయకులు జి వెంకటయ్య ను పాల్గొని, మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా సుదీర్ఘకాలంగా కార్మికులు ఆందోళన చేస్తున్నారు అయినా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు కార్పొరేటు శక్తుల లాభాలు చేకూర్చడం కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది కార్మిక వర్గంపై రైతాంగంపై గ్రామీణ వ్యవసాయ కార్మికులపై భారాలు వేస్తున్నది పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకోవచ్చింది దేశానికి స్వాతంత్రం రాకముందే బ్రిటిష్ వారితో కొట్లాడి సాధించుకున్న చట్టాలపై బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తున్నది చట్టాలను నిర్వీర్యం చేసి కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేందుకు ఈ లేబర్ కోడ్ లు తీసుకువచ్చింది 8 గంటల పని దినాన్ని 12 గంటల పని దినంగా మార్చాలని చూస్తుంది వేతనాలు నిర్ణయించే పద్ధతిని చర్చల ద్వారా కాకుండా ఏకపక్షంగా నిర్ణయించే పద్ధతిని తీసుకువచ్చింది యూనియన్లలో గుర్తించే విషయంలో అనేక మార్పులు తెచ్చింది ఆయా పరిశ్రమల్లో అడ్వైజరీ బోర్డు తెస్తామని కోడ్ లో పొందుపరిచింది సామాజిక భద్రతపై దాడి చేస్తుంది పిఎఫ్ ఈఎస్ఐ చట్టాల్లో అనేక మార్పులు చేసి యజమానుల దయ దక్షిణాలపై కార్మికులు ఆధారపడేలా చేస్తుంది మహిళలను ప్రమాదకరమైన పనులలో రాత్రి వేళల్లో పని మరి చేయించవద్దని గత చట్టాల్లో ఉన్నప్పటికీ నేడు వాటిని రద్దుచేసి రద్దుచేసి పులుసులతో సమానంగా రాత్రింబవలు పనిచేయాలని పద్ధతిని తీసుకువచ్చింది ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పచెప్పేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నది కోసం భూములలో లాక్కోవడానికి తెచ్చిన మూడు నల్ల చట్టాలను రైతులు పోరాటం వల్ల ప్రభుత్వం వెనక్కి తీసుకొచ్చినప్పటికీ ఇతర రూపాలలో రైతు వ్యతిరేక విధానాలను కొనసాగిస్తుంది విత్తన చట్టం 2025 ముసాయిదా విద్యుత్తు సవరణ బిల్లు విబిజి రాంజీ చట్టం ఇతర చట్టాలలో ముందుకు తెచ్చింది ఇప్పటికి వ్యవసాయరంగం సంక్షోభంలోనే ఉంది దీని ఫలితంగా జీవనోపాధి కోసం నగరాలకు వలసలు పెరుగుతున్నాయి నేడు జాతీయ వ్యవసాయం మార్కెట్ ముసాయిదా పత్రం ద్వారా రద్దయిన చట్టాలలోని అంశాలను ముందుకు తెస్తూ రైతాంగం పై దాడి చేస్తున్నది స్వదేశీ విదేశీ బడా కార్పొరేట్ సంస్థలకు కట్టపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నది ఈ విధానాల ఫలితంగా ఏటా పదివేల మంది రైతులు ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి వాటి సవరణకు కనీసం మద్దతు ధర చట్టం తేవాలని అనే రసాలు విజ్ఞప్తి చేసిన ప్రభుత్వం పెరచెను పెడుతున్నది కార్పొరేటర్ శక్తులకు లక్షల కోట్ల రూపాయలు వివిధ ట్యాక్సీ ల పేరుతో రద్దు చేస్తున్నది ప్రభుత్వం రైతాంగానికి మాత్రం రుణమాఫీ చేయడానికి చేతులు రావడం లేదు అందుకే ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈరోజు దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నామని అన్నారు, కార్మికులు. రైతులు. ఉపాధి కూలీల. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం వాళ్లకి అండగా ఉండి బీజేపీ వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో, రేమద్దుల సర్పంచ్ నిరంజన్, రైతు సంఘం నాయకులు భాస్కర్, మల్లేష్, నాయకులు, భీమయ్య, కిన్నె వెంకటయ్య, అంగన్వాడి యూనియన్ నాయకులు శారద. రాధ. మాధవి. వరలక్ష్మి. పద్మ. సరిత. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు. మహేశ్వరి., శ్యామల, రేణుక, ప్రమీల గోవిందమ, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు, ఎల్లయ్య రంగస్వామి నాగన్న సుగ్రీవుడు అర్జునయ్య యాదగిరి చందు లాల్య, శాంతయ్య, శాంతమ్మ, ఎల్లమ్మ కృష్ణమ్మ, వివిధ రంగాల కార్మికులు సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేశారు.



## హైడ్రా రూ. 2,200 కోట్ల

# ప్రభుత్వ భూమి స్వాధీనం

* మొండికుంట ఆక్రమణలపై 'హైడ్రా' పంజా.. 11 ఎకరాల భూమి విముక్తి



హైదరాబాద్, ఫిబ్రవరి 12 : భారత శక్తి : నగరంలోని విలువైన ప్రభుత్వ భూములు, చెరువుల సంరక్షణే ధ్యేయంగా పని చేస్తున్న హైడ్రా (HYDRAA) మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. మాధాపూర్ హైటెక్స్ సమీపంలోని ఖానామెట్ పరిధిలో ఉన్న మొండికుంట చెరువును ఆక్రమణల నుంచి విముక్తి చేసింది. ఈ క్రమంలో దాదాపు 11 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు, దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. స్వాధీనం చేసుకున్న ఈ భూమి బహిరంగ మార్కెట్ విలువ సుమారు రూ. 2,200 కోట్లు ఉంటుందని అంచనా.

**నివాసితుల ఫిర్యాదుతో రంగంలోకి..**

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామం సర్వే నంబరు 53లోని మొండికుంటతో పాటు, సర్వే నంబరు 55లోని ప్రభుత్వ భూమి భారీగా కబ్జాకు గురవుతోందని 'హైడ్రా ప్రజావాణి'కి ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో సుమారు 11 ఎకరాల మేర భూమి కబ్జాకు గురైనట్లు స్పష్టమైంది.

**వ్యాపార సామ్రాజ్యంగా ఆక్రమణలు:**

చెరువు ఎఫ్‌టీఎల్ (FTL) పరిధిలోని ఒక ఆలయాన్ని హద్దుగా చూపిస్తూ కబ్జాదారులు పక్కా ప్రణాళికతో ఆక్రమణలకు పాల్పడ్డారు. అక్కడ 30కి పైగా వాణిజ్య షాపులు, మెకానిక్ షెడ్లు, ఐరన్ అండ్ స్టీల్ దుకాణాలు, వందలాది తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా నెలకు లక్షలాది రూపాయల అద్దెలు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

**ముందస్తు సమాచారంతోనే చర్యలు:**

ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో హైడ్రా పారదర్శకతను పాటించింది. జనవరి 31న రెవెన్యూ అధికారులు, ఆక్రమణదారులతో సమావేశం నిర్వహించి, ఎన్ఆర్ఎస్సీ (NRSC) శాటిలైట్ చిత్రాల ద్వారా కబ్జాలను నిర్ధారించారు. ఆక్రమణదారులకు తగిన సమయం ఇచ్చిన తర్వాతే గురువారం భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు:**

హైడ్రా తీసుకున్న ఈ నిర్ణయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా కబ్జాకోరల్లో ఉన్న చెరువుకు విముక్తి లభించడంతో అధికారులను అభినందించారు. స్వాధీనం చేసుకున్న భూమిలో పార్కులను అభివృద్ధి చేయాలని, మొండికుంట చెరువును సుందరీకరించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**భూబకాసురులకు హెచ్చరిక :**

హైడ్రా చేపట్టిన ఈ భారీ ఆపరేషన్ కేవలం భూముల స్వాధీనమే కాకుండా, అక్రమార్కులకు బలమైన హెచ్చరికగా నిలుస్తోంది. ముఖ్యంగా హైటెక్ సిటీ వంటి ఖరీదైన ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్తులను కాపాడటం ద్వారా కోట్లాది రూపాయల ప్రజాధనం రక్షించబడింది. చెరువుల పునరుద్ధరణ విషయంలో ప్రభుత్వం చూపిస్తున్న చిత్తశుద్ధికి ఈ ఘటన ఒక నిదర్శనం.



# మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కు ఏర్పాట్లు పూర్తి

* ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు .
* జిల్లా కలెక్టర్. ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి..

వనపర్తి జిల్లా , హైదరాబాద్, ఫిబ్రవరి 12 (భారత శక్తి): వనపర్తి జిల్లాలోని 5 మున్సిపాలిటీలకు సంబంధించి శుక్రవారం ఉదయం 8 గంటల నుండి ప్రారంభం కానున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం జిల్లా ఎన్నికల అథారిటీ వనపర్తి, అమర్చింత, ఆత్మకూరు, కొత్తకోట, పెబ్బేర్ మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వనపర్తి జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో ఏ మున్సిపాలిటీకి అదే మున్సిపాలిటీ పరిధిలో లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది.

వనపర్తి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల నర్సింగాయ పల్లి. పెబ్బేరు: ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల జాతీయ రహదారి పక్కన, కొత్తకోట:





ప్రభుత్వ జూనియర్ కళాశాల,

* ఆత్మకూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల, అమర్చింత: జిల్లా పరిషత్ హైస్కూల్ అమర్చింత లో లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ లెక్కింపు ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయడం జరిగిందని, మూడు అంచెల పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయి మధ్యాహ్నం వరకు అన్ని ఫలితాలు పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లెక్కింపు కేంద్రాల్లో ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదని, గుర్తింపు కార్డు లేని వ్యక్తులకు పోలింగ్ కేంద్రంలోకి అనుమతి లేదని తెలియజేశారు. ఎన్నికల అభ్యర్థితో పాటు ఒక ఏజెంట్ ను మాత్రమే లెక్కింపు కేంద్రంలోనికి అనుమతించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు, అధికారులు, సిబ్బంది అందరూ సహకరించించి కౌంటింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఆర్డీఓ సుబ్రమణ్యం , డీఎస్పీ వెంకటేశ్వర రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసిల్దార్ రమేష్‌రెడ్డి, ఇతర సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలపై కార్మికుల గర్జన

* మహేశ్వరంలో భారీ బైక్ ర్యాలీ.. పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి




మహేశ్వరం, హైదరాబాద్, ఫిబ్రవరి 12 (భారత శక్తి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మహేశ్వరం నియోజకవర్గంలో కార్మిక సంఘాలు కదం తొక్కాయి. ఉద్యోగ భద్రత, కార్మిక హక్కుల పరిరక్షణే ధ్యేయంగా గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఐఎన్‌టియుసి (INTUC) కార్మిక శాఖ అధ్యక్షుడు నడికుడ శివ, ఏఐటియుసి (AITUC) నాయకుడు దత్తు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

* **హక్కుల సాధనకై పోరాటం:**

దేశవ్యాప్త కార్మిక సంఘాల పిలుపులో భాగంగా చేపట్టిన ఈ ర్యాలీలో కేంద్ర ప్రభుత్వ తీరుపై నాయకులు నిప్పులు చెరిగారు. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాలు కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీస్తూ, వారి హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని విమర్శించారు. ముఖ్యంగా కనీస వేతనాల అమలులో నిర్లక్ష్యం, ఉద్యోగ భద్రత కరువవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

* **ఐక్యతతోనే విజయం:**


ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నీరుగార్చడం తగదని, హక్కుల సాధన కోసం నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో కార్మికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ వార్తా కథనం కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, కార్మిక విధానాలపై పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాలు ఎక్కువగా ఉన్న మహేశ్వరం వంటి నియోజకవర్గాల్లో కార్మిక సంఘాలు ఏకమవ్వడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. రాబోయే రోజుల్లో ఈ నిరసనలు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది.

# వాసవి మరియు వనిత క్లబ్ ఆధ్వర్యంలో శివ స్వాములకు అన్న ప్రసాద వితరణ

నాగర్ కర్నూల్ జిల్లా , హైదరాబాద్, ఫిబ్రవరి 12 (భారత శక్తి): గత 13 సంవత్సరాల నుండి శివ స్వామి మాల ధరించి మరియు మొక్కుబడితో సుదూర ప్రాంతాల నుండి కాలినాడకన శ్రీశైలం వెళ్లే భక్తులకు శ్రీ లలిత సహస్రనామ సేవా సమితి ఆధ్వర్యంలో ఉదయం ఫలాహారం మధ్యాహ్నము అన్న ప్రసాదము రాత్రి సమయంలో వివిధ రకాలైన అల్పాహారం అందిస్తూ సేవ చేస్తున్న



మహిళా మణులను అభినందిస్తూ ఈరోజు వాసవి మరియు వనిత క్లబ్ ఆధ్వర్యంలో అద్ద ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షులు సంబు అపర్ణ శ్రీనివాసులు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంత ఉన్నా సేవ చేసే భాగ్యం కొందరికే దక్కుతుందని అందుకే ఈ శ్రీ లలిత సహస్రనామ సేవా సమితి లో ఉన్న ప్రతి ఒక్కరికి శివయ్య ఆశీస్సులు ఉంటాయని అన్నారు ఇంతటి గొప్ప భాగ్యం అందరికీ దొరకదని ప్రతి ఒక్కరూ సేవా భావంతో ఉన్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని మన ధర్మాన్ని మన సంస్కృతిని మనం కాపాడుకుంటూ మన భావితరాల వారికి తెలియజేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ పూర్వ




అధ్యక్షులు డి వి నారాయణ గంధం ప్రసాద్ బాదం నరేందర్ కందూర్ లక్ష్మణ్ ప్రస్తుత కార్యదర్శులు సంబు అనిలా పాండు కోశాధికారులు వనిత క్లబ్ పూర్వ అధ్యక్షులు వాస లక్ష్మి లతో పాటు శ్రీ లలిత సహస్రనామ సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు

# ట్రిపుల్ ఐటీల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తాం : అసెంబ్లీలో మంత్రి నారా లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 12 (భారత శక్తి): రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ) క్యాంపస్‌లలో పూర్తిస్థాయి, శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. శాసనసభలో దీనిపై మాట్లాడిన ఆయన, ఈ క్యాంపస్‌ల అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణ కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని తెలిపారు. నిధుల కోసం ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రితో చర్చలు జరిపామని లోకేశ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'సాస్కీ' పథకం ద్వారా నిధులు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టులు (డీపీఆర్‌లు) సిద్ధం చేస్తున్నామని, తద్వారా కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువ నిధులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పనిచేస్తున్న నాలుగు క్యాంపస్‌లకు అవసరమైన నిధుల వివరాలను మంత్రి సభకు తెలియజేశారు. నూజివీడు క్యాంపస్‌లో పనులు పూర్తి చేయడానికి రూ.60 కోట్లు, అరకు వ్యాలీలో నిర్మాణాలకు రూ.40 కోట్లు అవసరమని అంచనా వేశామన్నారు. అదేవిధంగా, ఒంగోలు క్యాంపస్‌కు రెండు దశల్లో కలిపి రూ.600 కోట్లు, శ్రీకాకుళం క్యాంపస్ పనులు పూర్తి చేయడానికి రూ.300 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం శాశ్వత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు చదువు మధ్యలో తాత్కాలిక అకాడమీల కోసం వేర్వేరు జిల్లాలకు వెళ్లాల్సి వస్తోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఏ జిల్లాలో ట్రిపుల్ ఐటీ చదివే విద్యార్థులు అక్కడే తమ కోర్సును పూర్తి చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అని లోకేశ్ స్పష్టం చేశారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి, శాశ్వత సౌకర్యాలను ఏర్పాటు చేసి, విద్యార్థులు చేరిన క్యాంపస్‌లోనే చదువు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో, పుట్టపర్తిలో కొత్త ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేసే అవకాశంపై ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిచ్చారు. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి, తగిన పరిశీలన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన సభకు హామీ ఇచ్చారు.

## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ..
### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ

ఢిల్లీ, ఫిబ్రవరి 12 (భారత శక్తి): దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడుపుతున్నారు. ఈరోజు ఆయన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని వివిధ విమానాశ్రయాల అభివద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, ఈ క్రమంలో తదుపరి పనులు చేపట్టాలని కేంద్రమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. కొత్తగూడెం విమానాశ్రయానికి సంబంధించి పాల్వంచలో స్థలం గుర్తించామని తెలిపారు. ఓఎల్ఎస్ సర్వే, ఫీజబిలిటీ స్టడీ నిర్వహించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి, అదనంగా 249.82 ఎకరాలు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కూడా కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులపై ఆయనతో చర్చించారు. ముఖ్యమంత్రి నిన్న రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తదితరులతో భేటీ అయ్యారు.

## చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ పై సీసీఐ కొరడా

ఢిల్లీ, ఫిబ్రవరి 12 (భారత శక్తి): ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఇంటెల్ కార్పొరేషన్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) భారీ జరిమానా విధించింది. బాక్స్‌డ్ మైక్రోప్రాసెసర్ల విషయంలో భారత్‌కు మాత్రమే ప్రత్యేకంగా అమలు చేసిన వారెంటీ పాలసీ నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలడంతో, రూ.27.38 కోట్ల ఫైన్ వేసింది. మ్యాట్రిక్స్ ఇన్ఫో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన ఫిర్యాదుతో ఈ కేసు విచారణకు వచ్చింది. ఇంటెల్ 2016 ఏప్రిల్ 25 నుంచి భారత్‌లో కొత్త వారెంటీ పాలసీని అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం, ఇంటెల్ అధీకృత భారతీయ డిస్ట్రిబ్యూటర్ల నుంచి కొనుగోలు చేసిన బాక్స్‌డ్ మైక్రోప్రాసెసర్లకు మాత్రమే ఇక్కడ వారెంటీ వర్తిస్తుంది. ఇతర దేశాల్లో కొన్న ప్రాసెసర్లకు భారత్‌లో వారెంటీ లభించదు. ఈ విధానంపై విచారణ జరిపిన సీసీఐ, డెస్క్‌టాప్‌ల కోసం ఉద్దేశించిన బాక్స్‌డ్ మైక్రోప్రాసెసర్ల మార్కెట్‌లో ఇంటెల్ ఆధిపత్య స్థానంలో ఉందని నిర్ధారించింది. చైనా, ఆస్ట్రేలియా, ఇతర దేశాల్లోని వారెంటీ పాలసీలతో పోలిస్తే, భారత్‌లో అమలు చేసిన విధానం వివక్షాపూరితంగా ఉందని అభిప్రాయపడింది. ఇది వినియోగదారుల ఎంపిక స్వేచ్ఛను పరిమితం చేయడంతో పాటు, ప్యారలల్ ఇంపోర్టర్లకు నష్టం కలిగించిందని పేర్కొంది. ఇది కాంపిటీషన్ యాక్ట్, 2002లోని సెక్షన్ 4ను ఉల్లంఘించడమేనని తేల్చింది. ఈ వివాదాస్పద పాలసీ ఎనిమిదేళ్ల పాటు అమల్లో ఉన్నందున, సంబంధిత టర్నోవర్‌పై 8 శాతం జరిమానా విధించాలని మొదట సీసీఐ భావించింది. అయితే, 2024 ఏప్రిల్ 1 నుంచి ఇంటెల్ ఈ పాలసీని స్వచ్ఛందంగా నిలిపివేయడం వంటి సానుకూల అంశాలను పరిగణనలోకి తీసుకుని, జరిమానా మొత్తాన్ని రూ.27.38 కోట్లకు తగ్గించింది. వివాదాస్పద వారెంటీ పాలసీని ఉపసంహరించుకున్న విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని, దీనిపై నివేదిక సమర్పించాలని ఇంటెల్‌ను సీసీఐ ఆదేశించింది.

## అడవుల్లోని గిరిజన గ్రామాలకు 'సంజీవని' డ్రోన్లు..

ఢిల్లీ, ఫిబ్రవరి 12 (భారత శక్తి): గిరిజన ప్రాంతాల్లోని పేదలకు ఆధునిక వైద్య సేవలను చేరువ చేసే దిశగా సరికొత్త సాంకేతిక విప్లవానికి ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'సంజీవని' మెడికల్ డ్రోన్ల పైలట్ ప్రాజెక్టును అల్లూరి సీతారామరాజు జిల్లాలో విజయవంతంగా నిర్వహించారు. వాగులు, వంకలు, కొండలు, కోనలు దాటుకుని ఆసుపత్రులకు వెళ్లే గిరిజన గ్రామాల ప్రజలకు ఇప్పుడు ఈ డ్రోన్లు ప్రాణదాతలుగా మారాయి. అల్లూరి జిల్లాలోని 2,191 గిరిజన గ్రామాలకు సరైన రవాణా సదుపాయాలు లేకపోవడంతో... అత్యవసర పరిస్థితుల్లో రోగులను, గర్భిణులను డోలీల ద్వారా కిలోమీటర్ల దూరం మోసుకెళ్లడం జరుగుతోంది. ఈ ప్రయాణంలో జరిగే ఆలస్యం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండటం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరుకు చెందిన రెడ్ వింగ్ సంస్థతో కలిసి డ్రోన్ల సేవలను కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. ఆసుపత్రులకు వెళ్లడానికి గంటల సమయం పట్టే ప్రాంతాలకు కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే అత్యవసర మందులను డ్రోన్లు అందజేస్తాయి. ఇవి సాధారణ డ్రోన్ల మాదిరి కాకుండా... శాటిలైట్ ట్రాకింగ్ తో ఆటోమేటెడ్ సాఫ్ట్ వేర్ తో పనిచేస్తాయి. 5 కేజీల బరువున్న మెడిసిన్స్, వ్యాక్సిన్స్, బ్లడ్ ప్యాకెట్స్, పాము కాటు మందులను చేరవేయడమే కాకుండా, అక్కడి రోగుల రక్త నమూనాలను పరీక్షల కోసం తిరిగి ఆసుపత్రికి తీసుకొస్తాయి. దీనివల్ల సకాలంలో వైద్యులు చికిత్స అందించడం సాధ్యమవుతుంది. పాడేరు డిగ్రీ కాలేజీని ప్రధాన హబ్ గా చేసుకుని ఈ డ్రోన్ ఆపరేషన్లను నిర్వహిస్తున్నారు.

## రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

ఢిల్లీ, ఫిబ్రవరి 12 (భారత శక్తి): లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ బీజేపీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్ సభలో బీజేపీ ఓ నోటీసును ఫైల్ చేసినట్లు సమాచారం. అయితే, రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేయలేదని తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రసంగించిన విషయం తెలిసిందే. రాహుల్ తన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్రం అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకుందని, ప్రధాని మోదీ దేశాన్ని అమెరికాకు అమ్మేశాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన బుక్ లో చైనా ఆక్రమణ విషయం స్పష్టంగా ఉందని, ఆ విషయంపై సభలో మాట్లాడకుండా అధికార పక్షం తనను అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. ఈ ప్రసంగంపై కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు సభలోనే అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రేడ్ డీల్ తో భారత్ కు ఎలాంటి నష్టం లేదని వివరించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ నోటీసు ఇచ్చారు.

## చంద్రుడిపై గల్లంతైన
## నాటి స్పేస్ క్రాఫ్ట్ మిస్టరీని తేల్చేసిన కృత్రిమ మేధ!

ఢిల్లీ, ఫిబ్రవరి 12 (భారత శక్తి):చంద్రుడిపై విజయవంతంగా దిగిన తొలి మానవరహిత స్పేస్ క్రాఫ్ట్ 'లూనా 9' ఆచూకీని ఎట్టకేలకు గుర్తించామని అంతరిక్ష పరిశోధకులు తాజాగా వెల్లడించారు. 1966 ఫిబ్రవరి 3న అప్పటి సోవియట్ యూనియన్ ఈ స్పేస్ క్రాఫ్ట్ ను అంతరిక్షంలోకి పంపించింది. చంద్రుడిపై విజయవంతంగా దిగిన ఈ వ్యోమనౌక.. చంద్రుడి ఉపరితలానికి సంబంధించి కీలకమైన వివరాలను పంపించింది. అయితే, ఇది కేవలం మూడు రోజుల పాటే పనిచేసింది. ఆ తర్వాత ఆచూకీ లేకుండా పోయింది. ఈ స్పేస్ క్రాఫ్ట్ 'ఓసియానస్ ప్రొసెల్లారమ్' రీజియన్ లో ల్యాండైందని శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే, వ్యోమనౌక దిగిన కచ్చితమైన లొకేషన్ ను గుర్తించేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. 1966 నుంచి ఈ విషయంపై శాస్త్రవేత్తలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఈ చిక్కుముడిని విప్పేసిందని యూకే, జపాన్ పరిశోధకులు తెలిపారు. నాసా తీసిన చిత్రాలను పరిశీలించి.. లూనా 9 చంద్రుడిపై దిగి గల్లంతైన చోటును ఏఐ గుర్తించిందని వివరించారు. ఓసియానస్ ప్రొసెల్లారమ్ రీజియన్ లో లూనా 9 దిగినట్లు భావిస్తున్న కొన్ని లొకేషన్లను ఎంపిక చేసిందని, ఈ ఫలితాలపై మరిన్ని పరిశోధనలు జరిపి కచ్చితమైన లొకేషన్ ను గుర్తిస్తామని ధీమా వ్యక్తం చేశారు. భారత్ కు చెందిన చంద్రయాన్ 2 ఆర్బిటర్ ద్వారా ఈ లొకేషన్లను పరీక్షించి చూస్తామని వివరించారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన బండ్ల గణేశ్

అమరావతి, ఫిబ్రవరి 12 (భారత శక్తి): సినీ నిర్మాత బండ్ల గణేశ్ గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తాను మొక్కుకున్న మొక్కును ఇటీవల తిరుమలకు పాదయాత్రగా వెళ్లి చెల్లించుకున్న నేపథ్యంలో, ఈ భేటీ జరిగింది. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును కలిసిన బండ్ల గణేశ్, ఆయనకు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో చంద్రబాబును అక్రమ కేసుల్లో అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు బండ్ల గణేశ్ ఒక సంకల్పం తీసుకున్నారు. చంద్రబాబు జైలు నుంచి విడుదలై, తిరిగి ముఖ్యమంత్రి అయితే తిరుమలకు నడిచి వస్తానని మొక్కుకున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించి, చంద్రబాబు నాలుగోసారి సీఎం కావడంతో తన మొక్కు తీర్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో 'సంకల్ప యాత్ర' పేరుతో జనవరి 19న షాద్‌నగర్‌లోని తన ఇంటి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. మొత్తం 23 రోజుల పాటు 535 కిలోమీటర్లు నడిచి, ఫిబ్రవరి 10న తిరుమల చేరుకున్నారు. రెండు రోజుల క్రితం శ్రీవారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నేడు



సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా బండ్ల గణేశ్ ను ఆయన ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. పాదయాత్ర సాగిన తీరును, దారిపొడవునా పార్టీ కార్యకర్తలు తనకు అండగా నిలిచి ప్రోత్సహించారని బండ్ల గణేశ్ ముఖ్యమంత్రికి వివరించారు.

## ఎర్రకోట దాడి వెనుక జైషే హస్తం.. మహిళలతో ప్రత్యేక వింగ్

ఢిల్లీ, ఫిబ్రవరి 12 (భారత శక్తి): పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహమ్మద్ (జేఈఎం) ఉగ్రవాద సంస్థపై ఐక్యరాజ్యసమితి (యూఎన్) సంచలన నివేదికను విడుదల చేసింది. గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన ఉగ్రదాడి వెనుక జైషే హస్తం ఉందని, ఆ సంస్థ మహిళలతో ప్రత్యేకంగా ఒక ఉగ్రవాద విభాగాన్ని కూడా ఏర్పాటు చేసిందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఐరాస భద్రతా మండలికి చెందిన ఆల్‌ఖైదా, ఐసిస్ ఆంక్షల పర్యవేక్షణ బృందం ఈ నివేదికను రూపొందించింది. 2025 నవంబర్ 9న ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన దాడిలో 15 మంది మరణించారని, ఈ ఘటనతో జైషే మహమ్మద్‌కు సంబంధం ఉన్నట్లు తమకు సమాచారం అందిందని పేర్కొంది. ఈ దాడితో పాటు మరికొన్ని దాడులకు జైషే బాధ్యత వహించినట్లు ఒక సభ్య దేశం తెలిపినట్లు నివేదికలో పొందుపరిచారు. అంతేకాకుండా జైషే చీఫ్, అంతర్జాతీయ ఉగ్రవాది మసూద్ అజార్ 2025 అక్టోబర్ 8న 'జమాత్ ఉల్ ముమినత్' పేరుతో మహిళా విభాగాన్ని అధికారికంగా ప్రకటించినట్లు నివేదిక తెలిపింది. ఉగ్రవాద దాడులకు మద్దతు ఇవ్వడమే లక్ష్యంగా ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. అయితే, ఈ నివేదికలో మరో ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది. ఒక సభ్య దేశం (పాకిస్థాన్ అని భావిస్తున్నారు) మాత్రం జైషే సంస్థ ఎప్పుడో 'నిర్వీర్యం' అయిపోయిందని వాదించింది. నివేదికలో జైషే ప్రస్తావనపై పాకిస్థాన్ తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పాకిస్థాన్ వాదన ఎలా ఉన్నప్పటికీ, జైషే మహమ్మద్ ఇప్పటికీ చురుకుగా కార్యకలాపాలు సాగిస్తోందని, అంతర్జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమించిందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

## అమరావతిలో బిట్స్ పిలానీ పనులు ప్రారంభం...
### నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు




అమరావతి, ఫిబ్రవరి 12 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్‌పిలానీ) క్యాంపస్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం ప్రకటించారు. నిర్మాణ పనులు మొదలైనందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ స్పందిస్తూ.. "అమరావతిలో నిర్మాణ పనులు మొదలయ్యాయి! పోర్టబుల్ క్యాబిన్లు, భారీ యంత్రాలు రంగంలోకి దిగాయి. ప్రపంచ స్థాయి విద్యకు భవిష్యత్ వేదిక రూపుదిద్దుకుంటోంది" అని తెలిపారు. బిట్స్ పిలానీ తమ నూతన క్యాంపస్ నిర్మాణాన్ని ప్రారంభించడం గర్వంగా ఉందన్నారు. "ఇన్నోవేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), నెక్స్ట్ జెన్ లెర్నింగ్ వంటివి ఇక్కడ అభివృద్ధి చెందుతాయి. రూపుదిద్దుకుంటున్న ఈ ఎడ్యుకేషన్ క్యాపిటల్‌కు స్వాగతం" అని లోకేశ్ పేర్కొన్నారు. ఈ క్యాంపస్ ఏర్పాటుతో అమరావతిని ఉన్నత విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రక్రియలో మరో కీలక అడుగు పడినట్లయింది. ఈ పరిణామంపై విద్యార్థులు, విద్యావేత్తల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది.

## జర్నలిస్టులకు 44 వేలకు పైగా అక్రిడిటేషన్ కార్డులు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (భారత శక్తి):రాష్ట్రంలోని జర్నలిస్టులకు శుభవార్త. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక, సీఎం సీపీఆర్వో మల్సూర్‌లతో మంత్రి పొంగులేటి సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. అక్రిడిటేషన్ కార్డులను పారదర్శకంగా జారీ చేయాలని ఆదేశించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందన్నారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు.

**అక్రిడిటేషన్ కార్డులు జారీ ఇలా..**

2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర, జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ, మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజాసేవలో ఐదేళ్ల ప్రస్థానం: లచ్చిరెడ్డికి కాలనీవాసుల నీరాజనం

* **సీసీ రోడ్ల మంజూరు, అభివృద్ధి పనులపై హర్షా తిరేకం**
* **ఎస్ కే డీ నగర్ కాలనీ సభ్యుల ఘన సన్మానం.**

బి.ఎన్.రెడ్డి నగర్(ర్వ), ఫిబ్రవరి 12 (భారత శక్తి): జాప్రతినిధి అంటే కేవలం పదవికే పరిమితం కాకుండా, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి నిరూపించారని ఎస్ కే డీ (SKD) నగర్ కాలనీవాసులు కొనియాడారు. కార్పొరేటర్ గా ఐదేళ్ల పదవీ కాలాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, కాలనీ అభివృద్ధిలో ఆయన పోషించిన క్రియాశీలక పాత్రను స్మరించుకుంటూ కాలనీ సభ్యులు కృతజ్ఞతా పూర్వక అభినందనలు తెలియజేశారు.

**అభివృద్ధి పనులే సాక్ష్యం..**

గత ఐదేళ్లలో ఎస్ కే డీ నగర్ కాలనీ రూపురేఖలు మార్చడంలో లచ్చిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారని కాలనీ ప్రతినిధులు పేర్కొన్నారు.

**ప్రధానంగా:**

మౌలిక వసతులు: కాలనీలో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న సమస్యలను గుర్తించి ఎప్పటి కప్పుడు పరిష్కరించడం.

సీసీ రోడ్ల నిర్మాణం: వర్షాకాలంలో ఇబ్బం దులు కలగకుండా, రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు భారీ నిధులతో సీసీ రోడ్ల పనులను పూర్తి చేయించడం.

**అందుబాటులో నాయకత్వం:**

ఏ చిన్న సమస్య వచ్చినా ఫోన్ కాల్కే స్పందించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంపై కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

* **కృతజ్ఞతలతో మునిగిపోయిన కార్పొరేటర్..**

ఈ సందర్భంగా కాలనీ సభ్యులు మాట్లాడుతూ.. తమ కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దినందుకు లచ్చిరెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిష్ఠించి, ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

* **హాజరైన ప్రముఖులు:**

ఈ ఆత్మీయ అభినందన కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు, రఘురాం నేత, ఈర్లపల్లి వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, ఎరువ వెంకటరెడ్డి, చక్రధర్ రావు, పి. వెంకట్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, మంద ప్రభాకర్, గోపాల్ రావు, రాజగోపాల్ రావు, సుబ్బారావు, కాంతారావు, శంకరన్న, వెంకట హరి, వెంకట్రావు, భరత్లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి

* **ఎల్బీనగర్లో టీయూసీఐ భారీ ర్యాలీ.. దేశవ్యాప్త సమ్మెకు మద్దతు.**

ఎల్బీనగర్, ఫిబ్రవరి 12 (భారత శక్తి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం టీయూసీఐ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ చౌరస్తా నుంచి కామినేని ఆసుపత్రి మీదుగా ఎల్బీనగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన సభ చేపట్టారు.

* **కార్పొరేట్ల కోసమే చట్టాల సవరణ**

ఈ సభకు ఎంఎల్పీఐ (రెడ్ ఫ్లాగ్) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఆర్. సంతోష్ అధ్యక్షత వహించగా, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి కాసిం, ఉపాధ్యక్షుడు ఎం. లింగస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాన్యం భూజేందర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేయడానికే 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా కుదించిందని వారు విమర్శించారు.




దేశ పారిశ్రామిక రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకే ఈ మార్పులు చేస్తున్నారని మండిపడ్డారు.

* **ప్రైవేటు కోరల్లో పారిశ్రామిక రంగం**

విద్యుత్, విత్తన సవరణ బిల్లులతో పాటు వీబీజీ రామ్ జీ బిల్లులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే దేశంలోని పారిశ్రామిక రంగం ప్రైవేటు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ముసుగులో కార్పొరేట్ల గుప్పెట్లోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలరాసే ఏ చట్టాన్ని ఊపేక్షించబోమని హెచ్చరించారు.

* **పాల్గొన్న ముఖ్యులు:**

ఈ కార్యక్రమంలో జన సాంస్కృతిక కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు పి. యాకన్న, నాయకులు కె. శ్రీను, పి. పరమేష్, విజయ్, పరమేశ్వరి, కళ్యాణి పాల్గొన్నారు. అలాగే ఆటో యూనియన్ నాయకులు ఎన్. మున్నా, దొబ్బల శీను, బాలరాజు, శేఖర్, కొమరయ్య, వ్యాన్ యూనియన్ నాయకులు భిక్షం, డి.ఎస్. పరమేష్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా మల్‌రెడ్డి రాంరెడ్డి జన్మదిన వేడుకలు

* **రమేష్ రాజు ఆధ్వర్యంలో పేదలకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ**

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం చైతన్యపురి కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

* **సేవా కార్యక్రమంతో ప్రత్యేకత**

రైల్వే అడ్వైజరీ కమిటీ సభ్యులు కేవీ రమేష్ రాజు ఆధ్వర్యంలో పేదలకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో అనుసంధానం చేయడం ద్వారా సామాజిక బాధ్యతను చాటి చెప్పారు.

* **"సమాజ సేవ ప్రతి ఒక్కరి ధర్మం"**

అని మల్‌రెడ్డి రాంరెడ్డి తెలుపుతూ, ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తన జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మంజుల రెడ్డి, నాయకులు ఆనంద్ గౌడ్, వెంకట్రామ్ రెడ్డి, డిఎస్ఎన్ఆర్ వర్తక సంఘాల సభ్యులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# అగ్నిపరీక్ష.. ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం!

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (భారత శక్తి): నగరంలో తిష్ఠవేసిన అక్రమ కట్టడాలు, అగ్నిమాపక నిబంధనలను తుంగలో తొక్కిన వ్యాపార సముదాయాల గుండెల్లో 'హైడ్రా' బాంబు పేల్చింది. నిన్నటి వరకు హెచ్చరికలకే పరిమితమైన వ్యవస్థ.. ఇక ప్రత్యక్ష కార్యాచరణకు రంగం సిద్ధం చేసింది. ''ముప్పు ముంచుకొస్తోంది.. ముప్పై సెకన్లలోనే ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉంది.. జాగ్రత్త పడతారో లేక సీజ్ చేయించుకుంటారో మీ ఇష్టం'' అంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ విసిరిన హెచ్చరికలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

గురువారం పాతబస్తీ వేదికగా జరిగిన అవగాహన సదస్సు కేవలం ప్రసంగాలకే పరిమితం కాలేదు.. మార్చి రెండో వారం నుంచి మొదలుకాబోయే 'నిబంధనల వేట'కు స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చింది.

* **ముప్పు ముంగిట.. ముందస్తు హెచ్చరిక:**

వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో నగరంలోని ఇరుకు సందులు, నిబంధనలు లేని గోడౌన్లు అగ్నిగుండాలుగా మారే ప్రమాదం ఉందని హైడ్రా విశ్లేషించింది. ఇటీవల పాతబస్తీలో జరిపిన తనిఖీల్లో తొమ్మిది షాపులను సీజ్ చేయడం కేవలం శాంపిల్ మాత్రమేనని, అసలు ఆపరేషన్ మార్చిలో ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. వ్యాపారుల వినతి మేరకు ఇచ్చిన నెల రోజుల గడువును.. లోపాలను సరిదిద్దుకోవడానికి వాడుకోవాలని, లేదంటే తాళాలు వేయడానికి సిద్ధంగా ఉండాలని కమిషనర్ నిర్ద్వంద్వంగా ప్రకటించారు.

**ప్రమాదానికి కారణం 'నిర్లక్ష్యమే'!**

గతంలో జరిగిన అగ్ని ప్రమాదాల రికార్డులను పరిశీలిస్తే భయంకరమైన నిజాలు బయటపడుతున్నాయి:

అడ్డగోలు నిర్మాణాలు: అనుమతి ఒక అంతస్తుకు తీసుకుని, మూడు అంతస్తులు నిర్మించడం వల్ల గాలి ఆడే మార్గం లేక పొగ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

కార్డన్ ఆఫ్ డెత్: మెట్ల మార్గాలను, అత్యవసర ద్వారాలను (Fire Exits) స్టాక్ రూములుగా మార్చేయడం వల్ల రెస్క్యూ ఆపరేషన్లు అసాధ్యంగా మారుతున్నాయి.

విద్యుత్ అరాచకం: విద్యుత్ లోడ్ సామర్థ్యం పెంచుకోకుండా ఏసీలు, భారీ యంత్రాలు వాడటం వల్ల షార్ట్ సర్క్యూట్లు మృత్యుఘంటికలు మోగిస్తున్నాయి.

* **ఉలిక్కిపడుతున్న అక్రమ 'అక్రమార్కులు'**

హైడ్రా కేవలం అగ్ని ప్రమాదాలకే పరిమితం కాకుండా, ఎఫ్‌టీఎల్ (FTL) పరిధిలో ఉన్న నిర్మాణాలు, నాలాల ఆక్రమణలపై కూడా తన నిఘాను పెంచింది. ముఖ్యంగా బహుళ అంతస్తుల భవనాల్లో ఫైర్ ఎక్విప్‌మెంట్ కేవలం ప్రదర్శన వస్తువులుగానే మిగిలిపోవడంపై ప్రభుత్వం సీరియస్ గా ఉంది. మార్చి నుంచి చేపట్టబోయే తనిఖీల్లో విద్యుత్, పురపాలక, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో రంగంలోకి దిగనున్నాయి.

* **భద్రత కోసం హైడ్రా సూచనలు:**


స్వయం తనిఖీ: ప్రతి వ్యాపారి తన షాపులో వైరింగ్ నాణ్యతను తనిఖీ చేయించుకోవాలి.

అడ్డంకుల తొలగింపు: సెట్ బ్యాక్స్ (భవనం చుట్టూ ఖాళీ స్థలం) లో ఉన్న అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలి.

నీటి లభ్యత: భవనాల్లో ఫైర్ హైడ్రెంట్ సిస్టమ్స్ పనిచేసేలా చూసుకోవాలి.

సమాచార వ్యవస్థ: నిబంధనల ఉల్లంఘనలు కనిపిస్తే పౌరులే స్వయంగా హైడ్రాకు ఫిర్యాదు చేసే వెసులుబాటును వినియోగించుకోవాలి.

ఈ కార్యక్రమంలో ఎం.ఎల్.ఏ జుల్ఫీకర్, హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, విద్యుత్ శాఖ అధికారి ఏవీ రామారావు తదితరులు పాల్గొని రంజాన్ సీజన్ దృష్ట్యా వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



# నాయకోటి పవన్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన రాజకీయ ప్రముఖులు

కొత్తపేట, ఫిబ్రవరి 12 (భారత శక్తి): కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ మాతృమూర్తి నాయకోటి సులోచన ఇటీవల కన్నుమూసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ గురువారం కొత్తపేటలోని పవన్ కుమార్ స్వగృహానికి విచ్చేసి వారి కుటుంబాన్ని పరామర్శించారు. సులోచన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, పవన్ కుమార్ మరియు వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. "అమ్మ మరణం కుటుంబానికి తీరని లోటు" అని పేర్కొంటూ, ఈ కష్ట సమయంలో వారికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు.

* **ఫోన్ ద్వారా పరామర్శించిన కిషన్ రెడ్డి**

కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి సైతం నాయకోటి పవన్ కుమార్‌ను ఫోన్ ద్వారా సంప్రదించి తన సంతాపాన్ని తెలియజేశారు. సులోచన గారి మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని పవన్ కుమార్ కుటుంబానికి ధైర్యం చెప్పారు.

# పంచాయతీలకు రెండో విడత రూ.387 కోట్లు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (భారత శక్తి): తెలంగాణలోని గ్రామపంచాయతీలకు ఆర్థిక సంఘం మరోసారి నిధులు విడుదల చేసింది. తొలి విడతలో రాష్ట్రానికి రూ.259.36 కోట్లు రాగా.. తాజాగా రూ.387 కోట్ల నిధులు విడుదలయ్యాయి. దీంతో ఇప్పటి వరకు రూ.646.46 కోట్లు విడుదలైనట్లయింది. గ్రామపంచాయతీలకు ఇంకా రూ.2,400 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. పంచాయతీలకు ఎన్నికలు పూర్తికావడంతో విడతల వారీగా ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తోంది.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.